విశాలాంధ్ర



ఏలూరు, పశ్చిమ గోదావరి
కాకినాడ, కోనసీమ
తూర్పుగోదావరి

సోమవారం 14 అక్టోబరు 2024 8 పేజీలు

నేతలకు అక్షింతలు...

జిల్లాలో ఇటీవల చోటు చేసుకున్న పరిణామాలపై చిన్న బాస్ లోకేష్ నేతలపై సీరియస్ అయినట్లు సమాచారం. అధికారంలోకి వచ్చి మూడు నెలలు పూర్తికాక ముందే కొందరు ఎమ్మెల్యేలు, నాయకులు వ్యవహరిస్తున్న తీరుతో ప్రభుత్వానికి చెడ్డ పేరు తెచ్చే విధంగా ఉందని ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. విడివిడిగా నాయకులను పిలిపించుకుని క్లాస్ పీకినట్లు సమాచారం. అక్షింతలు వేసిన విషయాన్ని నాయకులు బహిర్గతం చేయకుండా జాగ్రత్త పడ్డారు. ఎమ్మెల్యేలు, నాయకుల వ్యవహార శైలి నిఘా వర్గాలు, పార్టీకి సంబంధించిన అంతరంగికుల నుంచి ఎప్పటికప్పుడు డాష్ బోర్డుకు చేరుతుంది.

- చిన్న బాస్ క్లాస్...!
- ఎమ్మెల్యేల తీరుపై ఆగ్రహం...
- నియోజకవర్గాల నుంచి ఫిర్యాదులు....

విశాలాంధ్ర బ్యూరో ఏలూరు: జిల్లాలో ఇటీవల కొందరు ఎమ్మెల్యేలు ప్రవర్తన తీరుపై టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, విద్యాశాఖ మంత్రి లోకేష్ సీరియస్ గా వార్నింగ్ ఇచ్చి పంపినట్లు పార్టీలో చర్చ నడుస్తోంది. ఒక ఎమ్మెల్యే నియోజకవర్గంలో బదిలీలు మొదలు అన్నింటిలోనూ పెద్ద ఎత్తున ఆమ్యామ్యాలు స్వీకరించి పార్టీ కార్యకర్తలు, నాయకులను స్థానికంగా చిన్న చూపు చూస్తున్నారన్న ఫిర్యాదులు వెళ్లాయి. ఆ ఎమ్మెల్యేని పిలిపించి మందలించినట్లు తెలుస్తోంది.ఆ ఎమ్మెల్యే నియోజకవర్గంలో పర్యటన సందర్భంగా పార్టీ కార్యకర్తల ఇళ్లకు కాకుండా ఎన్నికలలో పనిచేయకుండా ప్రతిపక్షంతో సాన్నిహిత్యంగా ఉన్నవారిని దగ్గర చేర్చడం గురించి అధిష్టానానికి ఫిర్యాదు చేశారు. ఈ అంశాలను కూలంకుశంగా విన్న చిన్న బాస్ సమీక్షించి నియోజకవర్గాల వారీగా వారిపై వస్తున్న ఆరోపణలను ఇతరత్రా అంశాలను దృష్టిలో పెట్టుకుని మొదటి విడతగా హెచ్చరికలతో సరిపెట్టినట్లు తెలుస్తోంది. ఇదేవిధంగా కొనసాగితే భవిష్యత్తులో ఆయా నియోజకవర్గాలలో ఎమ్మెల్యేలు డమ్మీలుగా మిగిలి పోవాల్సి ఉంటుందని హెచ్చరించినట్లు తెలిసింది. ఎన్నికలలో ఖర్చుపెట్టిన డబ్బులు రాబట్టుకునేందుకు కొందరు అధిష్టానం మాటలను సైతం లెక్కచేయకుండా నియోజకవర్గం వ్యవహరిస్తున్నారని

▶మిగతా 2లో..

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ల నమోదులో
భాగస్వాములు కావాలి : మంత్రి

విశాలాంధ్ర - పాలకొల్లు: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ల నమోదులో కూటమి నాయకులు భాగస్వాములు కావాలనీ, ఎన్డీఏ బలపరిచే పట్టభద్రుల ఎమ్మెల్సీని మంచి మెజారిటీతో గెలిపించుకోవాలని రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్ కళ్యాణమండపంలో పాలకొల్లు నియోజకవర్గం గ్రాడ్యుయేట్ ఎన్నికల ఓటు నమోదు అవగాహన సదస్సుకు శాసన మండల సభ్యులు వేపాడ చిరంజీవిరావు, ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజులతో కలసి మంత్రి రామానాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి రామానాయుడు మాట్లాడుతూ శాసన మండలిలో మన సమస్యలపై గొంతు వినిపించేందుకు ఈ గెలుపు అత్యవసరమన్నారు. నమోదు సమయం తక్కువ ఉన్నందున పట్టభద్రుల ఓట్ల నమోదు వేగవంతం చేయాలని కోరారు .గతంలో ఓటు నమోదు చేసి ఓటు వేసినప్పటికీ, మరలా కొత్తగా ఓటు నమోదు చేసుకోవాలన్నారు .ప్రతి ఇంటిని, ప్రతి బూత్‌లు వారీగా తిరిగి

▶మిగతా 2లో..

ప్రాచీన కాలం నుంచే భారతదేశంలో మతాలు

- భారతదేశం భిన్నత్వంలో ఏకత్వం
- ఊసరవెల్లి రాజకీయ నాయకుడు మాటలు నమ్మవద్దు
- ప్రజల్లో అంతరాలు సృష్టించడమే ఆ నాయకుడు లక్ష్యం
- సీపీఐ శత వసంతాల ఉత్సవాలు ఘనంగా నిర్వహించండి
- సీపీఐ శాఖ సమావేశంలో తాటిపాక మధు

విశాలాంధ్ర - సామర్లకోట : ప్రాచీన కాలం నుంచి భారతదేశంలో హిందూ మతం, జైన్ మతం, బౌద్ధమతం పుట్టాయని ఈ మతాలు వాటి సంస్కృతులు ఒకదానితో మరొకటి కలిసి పరస్పరం ప్రభావితం చేసుకున్నాయని వీటిని ఆయా ప్రజలు విభిన్నమైన భాషల్ని మాట్లాడిన విభిన్నమైన మతాలను ఆచరించిన మనదేశంలో గొప్ప భిన్నత్వంగా ఉన్న అంతర్లీనంగా అగాధమైన ఏకత్వం ఉందని అలాంటి భారతదేశంలో నేటి పరిపాలిస్తున్న బీజేపీ నాయకులు రాష్ట్రంలో ఊసరవెల్లి రాజకీయ నాయకుడు ప్రజల్లో వైశ్యమాలు సృష్టిస్తూ రాజకీయ

▶మిగతా 2లో..

పశువుల డాక్టర్‌ను నియమించాలని మంత్రి ఆదేశం

8 లో

పారదర్శకంగా ఉచిత ఇసుక : కలెక్టర్

8 లో

నేడు మద్యం షాపుల లాటరీకి ఏర్పాట్లు

జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

విశాలాంధ్ర- భీమవరం : జిల్లాలో నేడు జరగబోయే మద్యం షాపుల లాటరీ ప్రక్రియకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు.నూతన మద్యం పాలసీ 2024-2026కు జిల్లాలో భీమవరం స్టేషన్ పరిధిలోని 40 దుఖాణాలకు 1,287 దరఖాస్తులు, తణుకు స్టేషన్ పరిధిలోని 33 దుఖాణాలకు 877 దరఖాస్తులు, తాడేపల్లిగూడెం స్టేషన్ పరిధిలోని 36 దుఖాణాలకు 1,224 దరఖాస్తులు, పాలకొల్లు స్టేషన్ పరిధిలోని 19 దుఖాణాలకు 873 దరఖాస్తులు, నరసాపురం స్టేషన్ పరిధిలోని 24 దుఖాణాలకు 958 దరఖాస్తులు, ఆకివీడు స్టేషన్ పరిధిలోని 23 దుకాణాలకు 408 దరఖాస్తులు చొప్పున జిల్లాలోని మొత్తం 175 షాపులకు 5,627 దరఖాస్తులు చేసుకోవడం జరిగిందని తెలిపారు.నేటి ఉదయం గం.8లకు పెదఆమిరంలోని నిర్మలా దేవి ఫంక్షన్ హాలు నందు గెజిట్ నెంబర్ వారీగా, సర్కిల్ వారీగా జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో లాటరీ విధానంతో మద్యం దుఖాణాలు అత్యంత పారదర్శకంగా కేటాయించడం జరుగుతుందన్నారు. దరఖాస్తుధారులు లేదా ఆధొరైజెడ్ వ్యక్తులు నిర్దేశించిన సమయానికి తప్పకుండ హాజరుకా వాలని తెలిపారు. దరఖాస్తుదారుడు తన అప్లికేషన్ ఫారం, ఎంట్రీ లేదా గేట్ పాస్ తప్పనిసరిగా తీసుకురావాల్సి ఉంటుందన్నారు. ఒక వేళ దరఖాస్తుదారుడు హాజరు కానీ పక్షంలో వారు ఎవరినైనా ఆధరైజుడు చేస్తే సదరు వ్యక్తి ఆధరైజెడ్ ఫారంతో పాటు పాన్ కార్డు / ఆధారు కార్డు / పాస్పోర్ట్ / డ్రైవింగ్ లైసెన్సు / ఓటర్ కార్డు / రేషన్ కార్డ్ / బ్యాంక్ పాస్ బుక్ కానీ నకలు వెంట తీసుకురావాలని తెలిపారు. షాప్ కేటాయించబడిన వ్యక్తులు సదరు లైసెన్సు ఫీజులో మొదటి వంతు నగదు రూపేణకానీ లేదా ఆన్లైన్ చెల్లింపు ద్వారా కానీ ఆక్షన్ హాల్ నందు ఏర్పాటు చేసిన బ్యాంక్ కౌంటర్ నందు చలానా చెల్లించాల్సి ఉంటుం దన్నారు. లాటరీకి వచ్చు దరఖాస్తుదారులు వారి వాహనాలను కేటాయించిన స్థలంలోనే పార్కింగ్ చేసి, ట్రాఫిక్ కి ఎటువంటి అంతరాయం కలిగించరాదని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

భాగస్వాములు కావాలి : మంత్రి

(1వ పేజీ తరువాయి)

పట్టభద్రులను గుర్తించి ఆఫ్ లైన్, ఆన్‌లైన్‌లో ఓటు నమోదు చేయించాలన్నారు. ఓటు నమోదు ప్రక్రియ విజయ వంతంగా చేసుకోగలిగితే గెలుపు అంత సులువుగా ఉంటుందన్నారు. ఓటు నమోదు చేయించడం ఎంత ముఖ్యమో, వారిని ఆ తేదీ, ఆ సమయంలో ఓటు వేసుకునేలా చూడవలసిన బాధ్యత కూడా అంతే ముఖ్యం అన్నారు.గత ప్రభుత్వం ఓటమి నుండి పాఠాలు నేర్చుకోకపోగా ప్రజా ప్రభుత్వంపై తప్పుడు వ్రాతలు రాస్తున్నారని, తప్పుడు విమర్శలు చేస్తున్నారని అన్నారు.రాష్ట్రం 14 లక్షల కోట్లు అప్పుల్లో ఉన్నప్పటికీ, అసలు వడ్డీ కడుతూ, రాష్ట్రంలో సంక్షేమ అభివృద్ధి కి ఏ లోటు లేకుండా సమర్ధవైన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు.ఆయనకు తోడుగా జనసేన అధినేత ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సహకారంతో రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళ్ళుతున్నామన్నారు. కేవలం 120 రోజుల్లో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటి అమలు చేస్తూ, ప్రజలు మనోభావాలకు అనుగుణంగా మంచి పాలన అందిస్తామన్నారు.ఈనెల 14 వ తేదీ నుండి గ్రామాలలో పండుగ కార్యక్రమాలు రాష్ట్ర వ్యాప్తంగా చేస్తున్నామని, గ్రామాల్లో పెండింగ్లో ఉన్న పనులను దశలవారీగా పూర్తి చేసేలా అన్ని చర్యలు తీసుకుంటున్నామని మంత్రి రామానాయుడు తెలిపారు. శాసన మండలి సభ్యులు వేపాడ చిరంజీవి రావు మాట్లాడుతూ గ్రాడ్యుయేటు ఎమ్మెల్సీ ఓటు నమోదు ప్రక్రియ 30 నియోజకవర్గాలకు సంబంధం చిందన్నారు.ఎన్డీఏ నాయకులు కలసి కట్టుగా తిరిగితే మంచి ఫలితాలు వస్తాయన్నారు. గ్రామ,వార్డు సచివాల యంలో ప్రతి ఉద్యోగి డిగ్రీ చదివివారు, వారి పరిధిలో డిగ్రీ చదువుకున్న వారి పూర్తి జాబితా తీసుకుని ఓటు నమోదు ప్రక్రియ వేగవంతం చెయ్యాలన్నారు.కోచింగు సెంటర్లు, ప్రభుత్వ, ప్రవేటు,వివిధ కార్యాలయాలు తిరిగితే గ్రాడ్యుయేటు ఓట్లు నమోదును సులభంగా పూర్తి చేయవచ్చన్నారు. ఓట్లు నమోదు ప్రక్రియ ఎంత విజయవంతం అయితే,గెలుపు అంత సులువుగా ఉంటుందన్నారు.ఈ కార్యక్రమంలో ఏపిఐఐసి చైర్మన్ మంతెన రామరాజు, మాజీ శాసనమండలి సభ్యులు అంగర రామ్మోహన్, నాయకులు జీవి,పెచ్చెట్టి బాబు,బోణం నాని,జనసేన పట్టణ అధ్యక్షులు శిడగం సురేంద్ర, మామిడిశెట్టి పెద్దిరాజు, జక్కంపూడి కుమార్, కోడి విజయ భాస్కర్, పెనుమత్స రామభద్రరాజు, గొట్టుముక్కల సూర్యనారాయణ రాజు, ధనాని సూర్య ప్రకాష్, పాములు రజనీ కుమార్, బొప్పన కిషోర్, పీతల శ్రీనివాసు, టిడిపి,బిజెపి, జనసేన నాయకులు, పాల్గొన్నారు

అధికారులు అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్

విశాలాంధ్ర- భీమవరం: బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనున్న నేపథ్యంలో జిల్లాలో అక్టోబర్ 14,15 తేదీల్లో తేలికపాటి వర్షాలు, 16న భారీ వర్షాలు కురిసే అవకాశమున్న నేపథ్యంలో, జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అధికారులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో జిల్లాలో వర్షాల ప్రభావానికి గురయ్యే ప్రాంతాలను గుర్తించి, ముందస్తు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అనేక కీలక ఆదేశాలు జారీ చేశారు. మున్సిపల్ కమిషనర్లు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు పట్టణాలు, పల్లెల్లోని కాలువలు, డ్రైనేజీ మార్గాలను వెంటనే శుభ్రం చేయించడానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలు వర్షపు నీటి ప్రవాహాన్ని అడ్డుకోవడం కాకుండా ఉండేందుకు ప్రత్యేక శుభ్రత కార్యక్రమాలు చేపట్టాలని పల్లెలు, పట్టణాల అధికారులకు సూచించారు. వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు తమ పంటలను రాబోయే వర్షాల నుంచి ఎలా సంరక్షించుకోవాలో సూచనలు అందించాలన్నారు. పంట నష్టాన్ని తగ్గించుకునేందుకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని రైతులకు అవగాహన కల్పించాలన్నారు. జలవనరుల శాఖ అధికారులు డ్రైన్లు, కాలువలలో నీటి మట్టాలను నిరంతరాయంగా పర్యవేక్షించాలన్నారు. అనేక చోట్ల నీటి ప్రవాహ స్థాయిలను పర్యవేక్షిస్తూ, సమయానుకూలంగా నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. అన్ని మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు, జల వనరుల శాఖ అధికారులు, జిల్లా అధికారులు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి సంఘటనలు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అన్ని శాఖలు సమన్వయం చేసుకుని అత్యవసర పరిస్థితుల్లో త్వరితగతిన స్పందించేలా సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. ప్రజలు జిల్లా అధికారుల సూచనలను పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

మెగా డీఎస్సీ ఉచిత శిక్షణ శిబిరం సద్వినియోగం చేసుకోండి : ఎమ్మెల్యే

విశాలాంధ్ర పెదవేగి: మెగా డీఎస్సీ ఉచిత శిక్షణ శిబిరాన్ని అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని దెందులూరు శాసనసభ్యులు చింతమనేని ప్రభాకర్ తెలిపారు. మెగా డీఎస్సీ 2024కు సంబంధించి దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఆధ్వర్యంలో ఏలూరులో నిర్వహించనున్న ఉచిత శిక్షణ తరగతుల కార్యక్రమ వివరాల బ్రోచర్‌ను విజయ దశమి పర్వ దినాన దుగ్గిరాల క్యాంపు కార్యాలయంలో దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా పలువురు డీఎస్సీ ఆశావహులకు శిక్షణ తరగతుల అప్లికేషన్లు అందచేసి శు భాకాంక్షలు తెలియచేశారు. రాష్ట్ర ప్రభుత్వం త్వరలో విడుదల చేయనున్న మెగా డీఎస్సీ నోటిఫికేషన్లో దెందులూరు నియోజక వర్గం నుంచి భారీ సంఖ్యలో ఉపాధ్యాయ పోస్టులు సాధించేల నిరుద్యోగ అభ్యర్థులకు డీఎస్సీ పై 100 రోజులు ఉచిత శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తున్నమని,శిక్షణ సమయంలో అభ్యర్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్ ఇవ్వటంతో పాటు ఉచితంగా భోజన సౌకర్యం కూడా కల్పిస్తామన్నారు. ఎక్కడ ఎలాంటి రాజీ లేకుండా, ప్రైవేట్ కోచింగ్ సెంటరులకి ధీటుగా విశిష్ట అనుభవం కలిగిన అధ్యాపకులను నియమించి దాదాపు 600మంది అభ్యర్థులకు శిక్షణ అందించెల ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 22వ తేదీ వరకు దుగ్గిరాల క్యాంపు కార్యాలయంలో అభ్యర్థుల వివరాలు నమోదు చేయటం జరుగుతుందని, ఈనెల 27న నుంచి ఏలూరులోని కె.పి.డి.టి. హై స్కూల్ ఆడిటోరియంలో 100 రోజుల శిక్షణ శిబిరం ప్రారంభం అవుతుందని, దెందులూరు నియోజక వర్గం సహా సమీప గ్రామాల్లోని నిరుద్యోగ అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీల అధ్యక్షులు బొప్పన సుధా, లావేటి శ్రీనివాస్, మాగంటి నారాయణ ప్రసాద్ (మిల్లు బాబు), నంబూరి నాగరాజు, టిడిపి నాయకులు తాతా సత్యనారాయణ,ఉప్పలపాటి రామ్ ప్రసాద్, గుత్తా అనిల్, మొతుకూరి నాని,జమలయ్య,శిక్షణ శిబిరం పర్యవేక్షకులు కడియాల కృష్ణారావు, పోలవరపు దేవరత్నాకర రావు,నాగేంద్రులు పాల్గొన్నారు.

కో -ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు నూతన బ్రాంచ్ ప్రారంభం

విశాలాంధ్ర - పాలకొల్లు: పాలకొల్లు పట్టణం పోస్ట్ ఆఫీస్ దగ్గరలో ఏర్పాటుచేసిన ది జాం పేట కో - ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు నూతన బ్రాంచ్‌ని ఆదివారం రాష్ట్ర జల వనరుల శాఖా మంత్రి డా. నిమ్మల రామానాయుడు స్వయంగా ప్రారంభోత్సవం చేశారు. ప్రారంభోత్సవం అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలకు మేలు జరిగేలా మెరుగైన బ్యాంకింగ్ సేవలను అందించాలని, మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు. బ్యాంకు సిబ్బంది ముఖ్య టిడిపి నేతలు పాల్గొన్నారు

పల్లె పండుగ జయప్రదం చేయండి

విశాలాంధ్ర- ఉంగుటూరు: ఉంగుటూరు మండలంలో 14,18 తేదీల్లో జరిగే పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాలు జరుగుతాయని ఎంపీడీవో మనోజ్ తెలిపారు. ఉంగుటూరు మండలానికి మంజూరైన రూ.4కోట్ల 41 లక్షల 50 వేలు పనులకు ఎమ్మెల్యే ధర్మరాజు శంకుస్థాపన చేస్తారన్నారు. కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై జయప్రదం చేయాలని ఎంపీడీవో కోరారు.

సుబ్బారావుకు సన్మానం

విశాలాంధ్ర - ఉంగుటూరు: అందరికీ ఆదర్శంగా ఉంటూ సేవా కార్యక్రమాలు చేస్తున్న వెజ్జు సుబ్బారావును వక్తలు అభినందించారు. ఉంగుటూరు మండలం కైకరం గ్రామంలోని తూర్పు వీధి కాలవ గట్టున, కళింగపేటలో ఉన్న కనక దుర్గమ్మ అమ్మవారిని దాత, శ్రీ కృష్ణదేవరాయ కాపు సంఘం, రంగాయువసేన, గౌరవ అధ్య క్షులు, జనసేన నాయకులు సుబ్బా రావు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు సుబ్బారావును శాలువాతో కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడు తూ... గ్రామ అభివృద్ధికి తన వంతు కృషితో పాటు, పేద ప్రజల అభ్యున్నతికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కాపు సంఘం నాయకులు, రంగా యువసేన సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

అక్షింతలు.

(1వ పేజీ తరువాయి)

ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. తమకు అనుకూలమైన అధికారులను పోస్టింగ్ చేయించుకుని వారి ద్వారా వసూళ్ల పర్వానికి దిగుతున్న విషయం సైతం లోకేష్ దృష్టికి వెళ్లినట్లు చెబుతున్నారు. జిల్లాలో కొందరు ఎమ్మెల్యేలు వ్యవహరిస్తున్న తీరు పట్ల పార్టీకి, ప్రభుత్వానికి నష్టం కలిగే విధంగా ఉందని, ఇదేవిధంగా కొనసాగితే ప్రజలను, కార్యకర్తల నుంచి పెద్ద ఎత్తున వ్యతిరేకత వస్తుందని భావించి ప్రారంభం లోనే కట్టడం చేసే పనిలో ఉన్నట్లు తెలుస్తోంది.

ఎం... ట్యాక్స్ వసూళ్ళు...?

ఈసారి కొందరు ఎమ్మెల్యేలు నిర్మొహటంగా ఎం... ట్యాక్స్ వసూళ్లకు టార్గెట్ పెట్టారు. జిల్లాలో మద్యం అమ్మకాలతో పాటు ఇతర ఆదాయ మార్గాల గురించి ప్రత్యేకంగా దృష్టి పెట్టడమే కాకుండా ఏ చిన్న అవకాశాన్ని వదులుకోకుండా వసూళ్లకు దిగటం చర్చనీయాంశంగా మారింది. ఉమ్మడి పశ్చిమ లో నలుగురు ఎమ్మెల్యేలు నేరుగా మద్యం టెండర్లలో జోక్యం చేసుకొని తమకు కావలసిన వాటాను వ్యాపారులతో ముందే నిర్దేశించుకుని అనుమతులు ఇచ్చినట్లు తెలియ వచ్చింది.ఒక ఎమ్మెల్యే ఎటువంటి పెట్టుబడి పెట్టకుండా 40 శాతం ప్రతి షాపు నుంచి వాటా ఇవ్వాలని టార్గెట్ పెట్టినట్లు విమర్శలు వస్తు న్నాయి.ఆ విధంగా వచ్చిన వారికే తన నియోజ కవర్గంలో అనుమతి ఉంటుందని లేకపోతే.. కేసులు,మరో మార్గంలో ఇబ్బందులు పెట్టి వ్యాపారాన్ని చేయకుండా అడ్డుకుంటామని నేరుగా బెదిరిం పులకు దిగడంతో వ్యాపారస్తులు బెంబేలెత్తిపోతు న్నారు.కొన్ని నియోజకవర్గాలలో పోటాపోటీగా టెండర్లు వేసేందుకు ప్రయత్నిస్తున్నా ..టెండర్లు వచ్చిన తరువాత సెటిల్మెంట్ చేయాలని నేరుగా సంప్రదింపులు జరుగుతున్నట్లు టెండర్ వేసినవారు ఆరోపిస్తున్నారు. మద్యం టెండర్లలో అధికార పార్టీ ఎమ్మెల్యేలు తమ వాటాల కోసం నిర్మొహమాటంగా వ్యాపారులతో బేరసారాలు చేయడం విమర్శలకు దారితీస్తోంది. ప్రతి నియోజకవర్గంలో జరుగుతున్న విషయాన్ని ఆయా పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎప్పటికప్పుడు చిన్న బాస్ కు చేరవేస్తున్నారు.

భారతదేశంలో మతాలు

(1వ పేజీ తరువాయి)

లబ్ధి పొందాలని చూస్తున్నాడని అందుకే తన సహజమైన డ్రామాలు వేస్తున్నారని ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తాటిపాక మధు తెలిపారు. స్థానిక విశ్వబ్రాహ్మణ కమ్యూనిటీ హాల్లో సీపీఐ మున్సిపల్ శాఖ సమావేశం, రైల్వే స్టేషన్ వద్ద హమాలీ కార్మికులతో సీపీఐ శాఖ సమావేశం పీ సత్యనారాయణ అధ్యక్షతన జరిగింది. ఈ సమా వేశానికి ముఖ్య అతిథిగా తాటిపాక మధు మాట్లాడుతూ ఒకప్పటి రాజకీయాలు ఇప్పుడు రాజకీయాలు భిన్నంగా ఉన్నాయని ఒకప్పుడు 5 ఏళ్ల కాలంలో ఏ అభివృద్ధి చేసామో చెప్పేవారని ఇప్పుడు మతం, కులం కార్డుతో రాజకీయాలు చేస్తున్నారని దీనివల్ల ప్రజాస్వామ్యవాదులు లౌకికవాదులు తీవ్ర ఆవేదన చెందుతున్నారన్నారు. భారత దేశ ప్రాచీన చరిత్ర సంస్కృతి ఇవేమి తెలియకుండానే ఈమధ్య ఊసరవెల్లి రాజకీయ నాయకుడు పిచ్చిప్రేలాపనలు పేలుతున్నారని ఆయన అన్నారు. భారతదేశం అనేక జాతుల నివాస భూమి అని ఆర్యులకు పూర్వులు ఇండో-ఆర్యులు, గ్రీకులు, సిథియన్లు హూనులు తురుష్కులు మొదలైన జాతుల వారు భారతదేశాన్ని తమ నివాస భూమిగా చేసుకున్నారన్నారు. భారతీయ సామాజిక వ్యవస్థ కళలు సాహిత్యము అభివృద్ధి చెందడానికి ప్రతి జాతి తన వంతు దోహదాన్ని చేసిందన్నారు. ఈ ప్రజలు వారి సంస్కృతి వీలు లేనంతగా కలిసిపోయాయని ఆయన గుర్తు చేశారు. మన ప్రాచీనుల ఐక్యంగా ఉండే వారిని తెలిపారు. భారతదేశ ఐక్యతను విదేశీయులు కూడా గుర్తించారని హిందూ అన్న పదం సింధు అన్న సంస్కృత పదంలో నుండి వచ్చిందని కాలక్రమాన గ్రీక్ పదానికి దగ్గరగా ఉన్న ఇండియా అన్న పేరు స్థిరపడిందని ఈ దేశాన్ని పర్షియన్ అరబిక్ భాషల్లో హింద్ అని పిలవడం ప్రారంభించారని మధు పేర్కొన్నారు. దక్షిణ భారతదేశంలో ఎప్పుడూ కుల, మత గొడవలు జరగలేదని కానీ ఈ మధ్యన ఒక డ్రామా రాజకీయ నాయకుడు మతం పేరుతో రాజకీయ పాఠశాల ప్రారంభించారని అతని మనసత్వాన్ని అతని రోడ్ మ్యాప్‌ను ప్రజలు అర్థం చేసుకోవాల న్నారు. 2025 డిసెంబర్ 26తో సీపీఐ శత వసంతాలు ప్రారంభ వేడుకలు ప్రారంభమవుతున్నాయని ప్రతి పార్టీ సభ్యుడు పార్టీ చరిత్రను అధ్యయనం చేసి పార్టీ యొక్క త్యాగాన్ని ప్రజలకు వివరించేలా చెప్పాలన్నారు. ఈ దేశానికి కమ్యూనిస్టు పార్టీ ఏం చేసిందో ప్రజలకు వివరించాలని ఆయన అన్నారు. ఇంకా ఈ సమావేశంలో పార్టీ నాయకులు రఘు, అర్జున్ రావు, రమణ, కిషోర్ కుమార్, శ్యామ్ ప్రసంగించారు.

భక్తిశ్రద్ధలతో దసరా ఉత్సవాలు

విశాలాంధ్ర-లింగపాలెం: ఉత్సవాలను లింగపాలెం మండలంలో ఘనంగా నిర్వహించారు. శని, ఆదివారాలలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ధర్మాజీ గూడెంలోని దుర్గమ్మ ఆలయంలో, లింగపాలెంలోని సరమ్మ ఆలయంలో, కొత్తపల్లిలోఅన్న సమారాధన జరిగింది. పార్టీలకు, రాజకీయాలకు అతీతంగా గ్రామాలలో ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా అమ్మవారు ఉత్సవాల్లో పాల్గొన్నారు. అంతా మంచి జరగాలని అమ్మవారికి పూజలు చేశారు.ధర్మాజీ గూడెంలో ఆదివారం అమ్మవారి ఊరేగింపు జరిగింది. అనంతరం అమ్మవారిని నిమజ్జనం చేశారు.

ఇన్‌స్పైర్ అవార్డుకు 1740 నామినేషన్లు

విశాలాంధ్ర -ఏలూరు: ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా వివిధ పాఠశాలల నుంచి ఇన్‌స్పైర్ అవార్డుసకు 1740 నామినేషన్ దాఖలు అయ్యాయని డిస్ట్రిక్ట్ సైన్స్ ఆఫీసర్ సోమయాజులు తెలిపారు. ఈ నెల 15తో నామినేషన్ల గడువు ముగుస్తుందని ఆయన పేర్కొన్నారు. వివరాలకు 9192422663 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు. నామినేషన్లు దాఖలలో ఏలూరు జిల్లా రాష్ట్రంలో ఆరో స్థానంలో నిలిచిందని ఆయన తెలిపారు.

మానవత్వం చాటుకున్న సాయిబాబు

విశాలాంధ్ర తణుకు: ఈ నెల 12 వ తేదీ మధ్యాహ్నం తణుకు వెంకట్రాయపురం కి చెందిన బాసం రాంబాబు ,వారి కుమార్తె మౌనిక ఇద్దరూ మండపాక యల్లారమ్మ అమ్మవారి దర్శనంకు కారులో వెళ్తున్న సమయంలో ప్రమాదవశాత్తు తణుకు ఆంధ్రా షుగర్స్ ఫ్యాక్టరీ ఎదురుగా ఉన్న కాలువలోకి కారు వెళ్లిపోవడం జరిగింది. మునిగిపోతున్న కారులో ఉన్న బాధితుల ఆర్తనాదాలు చూసి అటుగా వెళ్తున్న పెరవలి మండలం నల్లాకులవారిపాలెం గ్రామానికి చెందిన సాయిబాబు చలించిపోయి తనకు ఈత రాదనే విషయాన్ని మరిచిపోయి కాలువలోకి దూకి సుత్తితో కారు అద్దాలను పగలకొట్టిన వారి ఇద్దరినీ కాపాడారు. ప్రమాదంలో ఉన్న వారిని చూసి మానవత్వంతో స్పందించిన వారి యొక్క ధైర్య సాహసాలను అభినందిస్తూ తణుకు శాసన సభ్యులు ఆరిమిల్లి రాధాకృష్ణ ఆదివారం స్థానిక క్యాంపు కార్యాలయంలో సాయి బాబుకు శాలువా కప్పి సత్కరించి రూ. 10 వేలు బహుమతి అందజేసి వారిని అభినందించారు.కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

టీకేఎం అర్బన్ క్రూయిజర్ హైరైడర్ 'ఫెస్టివల్ లిమిటెడ్ ఎడిషన్

భీమవరం: టొయోటా కిర్లోస్కర్ మోటార్ (టికెఎం) ఈ రోజు అర్బన్ క్రూయిజర్ హైరైడర్ 'ఫెస్టివల్ లిమిటెడ్ ఎడిషన్'ని పరిచయం చేసింది. ఈ సందర్భంగా టికేయం సేల్స్ సర్వీస్ యూజ్డ్ కార్ విభాగ ప్రతినిధి శబరి మనోహర్ మాట్లాడుతూ ఇందులో ప్రత్యేకమైన టొయోటా జెన్యూన్ యాక్సెసరీస్ (టిజిఎ) ప్యాకేజ్‌లు ఉన్నాయన్నారు. 2022లో విడుదల అయినప్పటి నుంచి, అర్బన్ క్రూయిజర్ హైరైడర్ దాని అత్యాధునిక సాంకేతికత, డైనమిక్ పనితీరు అత్యుత్తమ ఇంధన సామర్థ్యంతో దేశవ్యాప్తంగా వినియోగదారుల హృదయాల్లో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుందన్నారు. టొయోటా కిర్లోస్కర్ మోటార్ 2022లో విడుదల చేసినప్పటి నుంచి, అర్బన్ క్రూయిజర్ హైరైడర్ స్థిరమైన మొబిలిటీని అందించడంలో టికెఎం యొక్క నిబద్ధతకు చిహ్నంగా ఉందన్నారు. అధిక కస్టమర్ సంతృప్తితో అపూర్వమైన ప్రజాదరణను పొందిందని, పెరుగుతున్న డిమాండ్ సానుకూల ఆదరణ తమ ఆఫర్‌లను నిరంతరం మెరుగుపరచడానికి ప్రోత్సహిం చాయ న్నారు. ప్రత్యేకమైన టిజిఎ ప్యాకేజీని కలిగి ఉన్న అర్బన్ క్రూయిజర్ హైరైడర్ ఫెస్టివల్ లిమిటెడ్ ఎడిషన్ పరిచయంతో తాము మా కస్టమర్‌లకు ప్రీమియం డ్రైవింగ్ అనుభవాన్ని అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు.

నియోజకవర్గం అభివృద్ధి చేస్తా : ఎమ్మెల్యే

విశాలాంధ్ర- పాలకోడేరు: ఉండి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళ్లి అభివృద్ధికి చిరునామాగా మారుస్తానని ఉండి శాసనసభ్యులు కనుమూరి రఘు రామ కృష్ణంరాజు అన్నారు. శని,ఆదివారం రెండు రోజులలో పాలకోడేరు మండలంలోని అనేక గ్రామాలలో కోట్ల రూపాయలతో సంబంధించిన అభివృద్ధి పథకాలకు ఆయన శంకుస్థాపనలు చేశారు. శనివారం ముందుగా పెన్నాడ గ్రామంలోని కొనుకు వారి వీధి రామాలయం వద్ద దసరా మహోత్సవాలు సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు ఆరంభించి అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. మండలంలోని విస్సాకోడేరు గ్రామంలో హై స్కూల్ వద్ద, గొరగనమూడి లో రజకుల వీధి, కొత్త వీధి,పెన్నాడ అగ్రహారంలో దండమ్మ గుడి వద్ద మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా మంజూరైన నిధులతో సీసీ రోడ్లు, డ్రైన్లకు శంకుస్థాపన చేశారు. మండల కేంద్రమైన పాలకోడేరు లోని కొత్తపేట, మంగయ్య చెరువుగట్టు వద్ద, గొల్లలకోడేరు గ్రామపంచాయతీ పరిధిలోని తుమ్మలగుంట పాలెంలో సీసీ డ్రైన్లు, సీసీ రోడ్లకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద సుమారు రూ. 6 కోట్ల వ్యయంతో పాలకోడేరు మండలంలోని అనేక గ్రామాలలో సీసీ డ్రైన్లు, సీసీ రోడ్లకు సంబంధించి శంకుస్థాపనలు చేయడం చాలా ఆనందంగా ఉందని అందులోనూ విజయదశమి రోజున చేయడం ఇంకా ఆనందంగా ఉందని అన్నారు .తన నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు అధిక మొత్తంలో నిధులు కేటాయించి మరింత అభివృద్ధి చేస్తానని కేంద్రంలో తమ కూటమి అధికారంలో ఉండడం తమకు సానుకూలంగా అనుకూలించే విషయం అని అన్నారు.ఈ అభివృద్ధి పనులలో దాతలను కూడా ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఆయా గ్రామాల సర్పంచులు ఎంపీటీసీలు,మండల స్థాయి అధికారులు, తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు,జనసేన పార్టీ నాయకులు కార్యకర్తలు, బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రం అభివృద్ధి

విశాలాంధ్ర - మొగల్తూరు: రాష్ట్ర అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని నర్సాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడులు అన్నారు. పవన్ కళ్యాణ్ ఆశయాలు జనసేన పార్టీ సిద్ధాంతాలకు ఆకర్షితులైన మొగల్తూరు గ్రామానికి చెందిన ఉప సర్పంచ్ బోణం నరసింహరావు, వైస్ ఎంపీపీ కైలా సుబ్బారావు ఎంపీటీసీ సభ్యులు దుసనపూడి జ్యోతి మహేశ్వరి దొరబాబులతో పాటు సుమారు 200 మంది కార్య కర్తలు జనసేన పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మొగల్తూరు ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. కూటమి ప్రభుత్వం గేటులు తెరిస్తే ప్రతిపక్ష పార్టీయే ఉండదని వారు అన్నారు. రాష్ట్రంలో రహదారులు డ్రైనేజీ తాగునీటి సమస్యలు కూటమి ప్రభుత్వంతో పరిష్కారం అవుతాయని అన్నారు. పార్టీలో చేరిన వారు పార్టీ అభివృద్ధికి పాటుపడాలని వారు సూచించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారికి జనసేన పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానం పలికారు. అనంతరం బొమ్మిడి నాయకర్ కొత్తపల్లి సుబ్బారాయుడులను గజమాలతో ఘనంగా సత్కరించారు. జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి చాగంటి మురళీకృష్ణ, కలవకోలను తాతాజీ, జక్కం బాబ్జి, కొల్లాటి గోపికృష్ణ,కోటిపల్లి వెంకటేశ్వరరావు, వల వల నాని, ఆకన చంద్రశేఖర్, బందెల రవీంద్ర, మేడిది బాబ్జి, చల్ల దాన్నయ్యానాయుడు, నిప్పులేటి తారక రామారావు, వాతాడి కనకరాజు, ఇంజేటి దానం గుబ్బల మార్రాజు, లక్కు బాబి, దాసరి కృష్ణాజీ ,దూసనపూడి సత్యనారాయణ, టిడిపి, బిజెపి నాయకులు జనసైనికులు వీర మహిళల తదితరులు పాల్గొన్నారు.

ప్రొ॥ సాయిబాబా మృతికి టీవీఎస్ రాజు సంతాపం

విశాలాంధ్ర కామవరపుకోట: ఢిల్లీ వర్సిటీ మాజీ ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబా మృతికి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సామాజిక హక్కుల సాధన సమితి చింతలపూడి ఏరియా గౌరవాధ్యక్షులు టీవీఎస్ రాజు, అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు షేక్ ఇబ్రహీం, పి సోమశేఖర్ ఆదివారం ఒక ప్రకటనలో ప్రగాఢ సంతాపం తెలిపారు. సాయిబాబా ప్రొఫెసర్ గా సేవలందిస్తూ సామాజిక హక్కుల సాధనలో ఎస్సీ, బీసీ, మైనార్టీ వర్గాల హక్కుల సాధన కోసం విశేషంగా కృషి చేసిన ఆయనపై ప్రభుత్వాలు అక్రమ కేసులు బనాయించి జైల్లో పెట్టి హింసించారని ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయస్థానాలు ఆయన్ని నిర్దోషి అని తీర్పు ఇచ్చినప్పటికీ ప్రభుత్వం సాయిబాబాపై అక్రమ కేసులు పెట్టి జైల్లోనే అనారోగ్యంతో ఉన్నా వైద్య సదుపాయం కల్పించక పోవడంతో మృతి చెందారని ఆరోపించారు. ఆయన మృతికి ప్రభుత్వమే నైతిక బాధ్యత వహించా లన్నారు.సాయిబాబా మృతికి అనేక ప్రజా సంఘాల నాయకులు సంతాపం తెలిపారు. సహాయ ఫౌండేషన్ ట్రస్ట్ గౌరవాధ్యక్షులు తమ్మిశెట్టి సత్యనారాయణ,ట్రస్ట్ చైర్మన్ వీరమల్ల మధుసూదన్ రావు, సాయన రాఘవమ్మ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ సాయన్న ,కనకరాజు, ప్రజానాట్యమండలి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా గౌరవ అధ్యక్షులు జానపద కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎల్ ఆర్ కృష్ణ బాబు, ప్రముఖ బుర్రకథ కళాకారుడు వీరమల్ల సత్యనారాయణ, సీనియర్ రంగస్థలం కళాకారుడు తిరుపతి రమేష్ బాబు, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కంకిపాటి బుచ్చిబాబు, ప్రజా కళాకారులు కంకిపాడు ఏసు పాదం,ఎం. ప్రేమానందం మహిళా బుర్రకథ కళాకారిణి విభూది రాజేశ్వరి ఆయన మృతికి సంతాపం తెలిపారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓట్ల నమోదుపై అవగాహన

విశాలాంధ్ర-నరసాపురం: నియోజవర్గం శాసనసభ్యుల కార్యాలయంలో ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల పట్టబద్రులు ఎమ్మెల్సీ ఎలక్షన్ ఓటర్ల నమోదు కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల అబ్జర్వర్‌గా నియమితులైన ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ చిరంజీవ రావు విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్డీఏ కూటమి నాయకులు, పోలింగ్ బూత్ ఇన్చార్జులు ఎంతో ప్రతిష్ఠగా పట్టభద్రుల ఓటర్లు నమోదు చెయ్యాలని దాని ద్వారా మన ఎన్డీఏ కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి విజయానికి ఎంతో దోహదపడుతుందన్నారు. ఓటు నమోదుకు తక్కువ సమయం ఉన్నందున సమిష్టి బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఐఐసి చైర్మన్ మంతెన రామరాజు, శాసనసభ్యులు బొమ్మిడి నాయకర్,మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు,టిడిపి ఇంచార్జ్ పొత్తూరి రామరాజు తదితరులు పాల్గొన్నారు.

శ్రీజగదాంబకు ఎమ్మెల్యే సిరి ప్రత్యేక పూజలు

విశాలాంధ - జీలుగుమిల్లి: శ్రీజగ దాంబ అమ్మ వారిని దసరా పండుగను పురస్కరించుకొని పోలవరం ఎమ్మెల్యే చిరి బాలరాజు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్సవ కమిటీ ఆహ్వాన మేరకు అమ్మవారిని దర్శించుకున్నట్లు ఆయన తెలిపారు. నియోజ కవర్గంలోని కూటమి నాయకులైన జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు, కార్యకర్తలకు పండుగను పురస్కరించుకొని అభినందనలు తెలిపారు. పోలవరం నియోజవర్గ ప్రజలు అమ్మ వారి ఆశీస్సులతో సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకున్నట్లు ఆయన తెలిపారు .ఈ కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షులు పసుపులేటి రాము ,ఉత్సవ కమిటీ చైర్మన్ కొండపల్లి ప్రసాద్, జనసేన సీనియర్ నాయకులు సరిపల్లి సత్యానారాయణ రాజు, కమిటీ ఉపాధ్యక్షులు సిరి శ్రీను, సభ్యులు కోల ధర్మరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే ధర్మరాజు పర్యటన..

విశాలాంధ్ర - ఉంగుటూరు: ఉంగుటూరు మండలంలో ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు సోమవారం పర్యటన వివరాలను ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి తెలిపారు. ఉదయం గం.9లకు వెల్లమిల్లిలో,గం. 10.30లకు, గం.11. 30లకు గోపినాధపట్నం,మధ్యాహ్నం గం.12.15లకు రామచంద్రపురం,గం.2.45 లకు బాదంపూడి,గం.3లకు ఉప్పాకపాడు గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఎమ్మెల్యే భూమి పూజ చేస్తారన్నారు.ఈ కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓట్ల నమోదులో భాగస్వాములు కావాలి : ఎమ్మెల్యే

విశాలాంధ్ర, కాళ్ళ: ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ల నమోదులో కూటమి నాయకులు భాగస్వాములు అయ్యి, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాన్ని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఉండి ఎమ్మెల్యే కనుమూరు రఘురామకృష్ణరాజు కోరారు. ఆదివారం జిల్లా తెలుగు దేశంపార్టీ కార్యాలయంలో ఉండి నియోజకవర్గం గ్రాడ్యుయేట్ ఎన్నికల ఓటు నమోదు అవగాహన సదస్సు ఉండి శాసనసభ్యులు కనుమూరి రఘు రామకృష్ణంరాజు అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి రావు మాట్లాడుతూ గ్రాడ్యుయేటు ఎమ్మెల్సీ ఓటు నమోదు ప్రక్రియ 34 నియోజకవర్గాలకు సంబంధించింది అని ఎన్డీఏ నాయకులు కలిసి కట్టుగా తిరిగితే మంచి ఫలితాలు వస్తాయన్నారు. గ్రామ,వార్డు సచివాలయంలో ప్రతి ఉద్యోగి డిగ్రీ చదివినవారిని,వారి పరిధిలో డిగ్రీ చదువుకున్న వారి పూర్తి జాబితా తీసుకుని ఓటు నమోదు ప్రక్రియ వేగవంతం చేయ్యాలన్నారు. శాసన మండలిలో మన ప్రాంత సమస్యలపై గళం వినిపించేందుకు గెలిపించి పంపించవలసిన బాధ్యత కూటమి నాయకులు, కార్యకర్తలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపిఐఐసి చైర్మన్, జిల్లా టిడిపి అధ్యక్షులు మంతెన రామరాజు, కనకరాజు సూరి,జుత్తిగ నాగరాజు, మాట్లాడారు.ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం , కనకరాజు సూరి,జుత్తిగ నాగరాజు, మోటుపల్లిరామ వర ప్రసాద్,జుత్తిగ శ్రీనివాస్ ,మంతెన పెద సరసింహారాజు, ఉండి, ఆకివీడు, కాళ్ళ, పాలకోడేరు టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో ఏపిఐఐసి చైర్మన్ గా ఎంపికైన మంతెన రామరాజు ను ఘనంగా సత్కరించారు.

ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఉచిత శిక్షణ

విశాలాంధ్ర భీమవరం: జిల్లాలో ప్రతిభావంతులైన పేద ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో ఉచిత డీఎస్సీ శిక్షణను ఇచ్చేందుకు చర్యలు చేపట్టడం జరిగిందని జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి కె.శోభరాణి తెలిపారు. ప్రతిభావంతులైన పేద ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు డీఎస్సీలో ఉత్తమ ఫలితాలు పొందేందుకు ప్రభుత్వం ఉచితంగా శిక్షణను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రెసిడెన్షియల్ ప్రాతిపదికన శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. టెట్ ఉత్తీర్ణులై ఉంటే వారికి స్క్రీనింగ్ టెస్టు నిర్వహించి ఆ టెస్టులో 85 శాతం, టెట్ నందు పొందిన మార్కుల్లో 15 శాతం వెయిటేజీని ఇచ్చి, వార్షిక ఆదాయం రూ.2.50 లక్షలలోపు ఉన్న వారిని ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. స్థానిక సచివాలయంలో 6 ప్రామాణిక అంశాలను పరిగణనలోకి తీసుకొని ఎంపిక ఉంటుం దన్నారు. శిక్షణ ఇచ్చేందుకు ఎంప్యానెల్మెంటు కోసం దరఖాస్తు చేసుకున్న శిక్షణా సంస్థలు ఈనెల 14 లోగా గుంటూరు జిల్లా తాడేపల్లిలోని సాంఘిక సంక్షేమశాఖ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించే సమావేశానికి హాజరు కావాలని ఆమె సూచించారు. ఆసక్తి గల ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు jnanabhumi.ap.gov.in వెబ్ సైట్ నందు దరఖాస్తులు 21 వరకు చేసుకోవాలన్నారు. కోచింగ్ ఎంపిక కోసం ఆన్లైన్ స్క్రీనింగ్ టెస్టు అక్టోబర్ 27న నిర్వహించడం జరుగుతుందని జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారు కె. శోభరాణి తెలిపారు.

పశువుల డాక్టర్‌ను నియమించాలని మంత్రి ఆదేశం

విశాలాంధ్ర - నూజివీడు : పాడి పశువుల ఆరోగ్య పరిరక్షణకు నూజివీడు పశువుల ఆసుపత్రిలో డాక్టర్ ను నియమించాలని రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్‌ను ఆదేశించారు. నూజివీడు మండలం పల్లెర్లమూడిలో ఆదివారం సాయంత్రం అనేక కార్యక్రమాలలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు తమ మండలంలో పశు సంపద ఎక్కువగా ఉందని, పశువులకు లంపీ స్కిన్ ఎలర్జీ వచ్చి ఆవులు చనిపోతున్నాయని మేకలు, గొర్రెలు,ఆవులకు, ఒకే రకమైన మోతాదులో ఇంజక్షన్ ఇస్తున్నారని దాన్ని మార్చి పశువులకు కావలిసిన నాణ్యమైన మందులు ఇచ్చి మెరుగైన వైద్యం అందించాలని, తమ మండలంలో పశువుల ఆసుపత్రిలో డాక్టర్ లేకపోవడంతో ఎంతో ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు తమ సమస్యను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ప్రజల సమస్యపై మంత్రి పార్థసారథి వెంటనే స్పందిస్తూ నూజివీడు మండలంలో పశువుల ఆసుపత్రిలో డాక్టర్‌ను నియమించాలని పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్‌ను సెల్‌ఫోన్ ద్వారా మంత్రి ఆదేశించారు. రైతు భరోసా కేంద్రాలు,విలేజ్ హెల్త్ క్లినిక్, సచివాలయాలు ,సగములో నిలిచిపోయాయని వెంటనే పూర్తి చేయాలని గ్రామస్తులు కోరగా, తక్షణమే పూర్తి చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన కొల్లి పద్మ తమ తల్లి కాన్సర్‌తో బాధ పడుతుందని మంత్రి దృష్టికి తీసుకొని రాగా వెంటనే రూ.10 వేల ఆర్థిక సాయంగా మంత్రి అందజేశారు. మంత్రి వెంట గ్రామ ప్రముఖులు రాజా, ఎ, రమేష్, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఉచిత ఇసుక : కలెక్టర్

విశాలాంధ్ర- ఏలూరు : జిల్లా ఉచిత ఇసుక విధానాన్ని పారదర్శకంగా అమలు చేస్తున్నామని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి రాష్ట్ర గనుల శాఖ కమీషనర్ మరియు డైరెక్టర్ ప్రవీణ్ కుమార్ కు తెలిపారు. రాష్ట్రంలో నదీ తీరప్రాంతాలు, తదితర ప్రదేశాలలో ఇసుక తవ్వకాల టెండర్స్ ప్రక్రియ, జిల్లా ఇసుక కమిటీలలో ఆమోదించుట, సిసి కెమెరాల ఏర్పాటు, తదితర అంశాలపై గనుల శాఖ కమీషనర్ రాష్ట్రంలోని జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా గనుల శాఖ కమీషనర్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుక విధానాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నదన్నారు. ఈనెల 16 నుంచి రాష్ట్రంలోని నదీ తీరప్రాంతాలు, తదితర ప్రదేశాలలో ప్రారంభం కానున్న ఇసుక తవ్వకాలు విధానాన్ని పకడ్బందీగా అమలు చేయాలన్నారు. ఇందుకు సంబంధించి టెండర్ల ప్రక్రియ, జిల్లా ఇసుక కమిటీ లో ఆమోదం పనులు పారదర్శకంగా నిర్వహించాలన్నారు. ఇసుక తవ్వక ప్రదేశాలలో సిసి కెమెరాల ద్వారా పర్యవేక్షించాలన్నారు. ఇసుక ఎక్కడా అక్రమంగా తరల కుండా పటిష్టమైన చర్యలు తీసుకోవా లన్నారు. జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాలో ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఉచిత ఇసుక విధానాన్ని పారదర్శకంగా అమలు చేస్తున్నామని, ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్నవారికి జిపిఎస్ కలిగిన వాహనాల ద్వారా అందిస్తున్నామన్నారు. ఇసుక అక్రమ రవాణాకు ఆస్కారం లేకుండా పటిష్టమైన నిఘా పెట్టామని ,ఇసుక స్టాక్ పాయింట్ల వద్ద సిసి కెమెరాలు ఏర్పాటుచేశామని, సిబ్బందిని కూడా నియమించామన్నారు.గనుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ బి. రవికాంత్, ప్రభుత్వులు పాల్గొన్నారు.

పండుగ వాతావరణంలో 'పల్లె పండుగ'

విశాలాంధ్ర- భీమవరం : నేటి నుండి 20 వరకు జిల్లాలో పండుగ వాతావరణంలో పల్లె పండుగ - పంచాయతీ వారోత్సవా లను విజయవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. ఈనెల 14 నుండి 20 వరకు జిల్లాలో గ్రామ స్థాయిలో నిర్వహించే పల్లె పండగ పంచాయతీ వారోత్సవాలు సంబంధిత శాఖల అధికారులు సమన్వయం చేసుకొని జిల్లా లో విజయవంతంగా నిర్వహించాలన్నారు.జిల్లాలో 423 పనులను రూ.51.03 కోట్ల వ్యయంతో చేపట్టనున్నట్లు తెలిపారు. వీటిలో 351 సిసి రోడ్లు రూ.41.94 కోట్లు,5 బీటీ రోడ్స్ రూ.2.46 కోట్లు,67 సీసీ డ్రైన్స్ రూ.6.63 కోట్లు ఖర్చు చేయనున్నట్లు తెలిపారు. ప్రతి పంచాయతీ పరిధిలో ఈ సంవత్సరములో చేసే అభివృద్ధి పనులకు సంబంధించి ఆ గ్రామంలో బోర్డు ఏర్పాటు చేయాలని సంబందించిన అధికారులను ఆదేశించారు. గ్రామీణ నీటి సరఫరా, పంచాయతీ రాజ్ శాఖల ద్వారా గ్రామస్థాయిలో వందకు వంద శాతం పనులు పూర్తి చేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. పంచాయతి సెక్రటరీలు ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టే పనులను పూర్తిచేయాలని, పంచాయతీ సెక్రటరీలు ముందుగానే గ్రామ స్థాయిలో నిర్వహించే పల్లె పండుగ- పంచాయతీ వారోత్సవాల నిర్వహణకు సంబంధించి టామ్ టామ్ వేయించాలన్నారు. భూమి పూజ చేసే వాటికి సంబంధించి పంచాయతీల్లో ప్రచారం చేయాలని, పంచాయతీ పరిధిలో చేసే అభివృద్ధి కార్యక్రమాలు, భూమి పూజ వంటి కార్యక్రమాల పూర్తి వివరాలను ప్రజా ప్రతినిధులకు ముందుగానే తెలియజేయాలని పంచాయతీ సెక్రటరీలకు సూచించారు. పంచాయతీ పరిధిలో ఎక్కడెక్కడ ఏఏ పనులు చేసి, వాటికి సంబంధించి ఎప్పుడు పూర్తి చేస్తారన్న పూర్తి వివరాలను గ్రామ సభలో ప్రజలకు తెలియజేసే విధంగా బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. గ్రామపంచాయతీలు వారీగా మంజూరైన పనుల జాబితాను మండలాలకు తెలియ జేయడం, మండలాల వారీగా గ్రౌండింగ్ (భూమి పూజ) కోసం గ్రామపంచాయతీలు వారీగా తేదీల వారీగా రోడ్ మ్యాప్ షెడ్యూల్‌ను అమలు చేయాలన్నారు. భూమి పూజ కోసం ప్రతిపాదించబడిన మంజూరు చేయబడిన పనులు, పనుల అప్‌లోడ్ చేయడం గ్రామపంచాయతీ కార్యదర్శుల ద్వారా పి ఆర్ వన్ యాప్ లో అప్‌లోడ్ చేయాలని తెలిపారు.

స్మైల్ మల్టీ స్పెషాలిటీ డెంటల్ హాస్పిటల్ 13వ వార్షికోత్సవం

విశాలాంధ్ర - తాడేపల్లిగూడెం: 12 సంవత్సరాల నుంచి స్మైల్ మల్టీ స్పెషాలిటీ డెంటల్ హాస్పిటల్ వారు తాడేపల్లిగూడెం పట్టణంలో ప్రజల ఆదారాభిమానాలు చూరగొన్నారని అందువల్లే 13వ వసంతంలో అడుగు పెట్టారని శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. స్మైల్ మల్టీ స్పెషాలిటీ డెంటల్ హాస్పిటల్ 13వ వార్షికోత్సవం సందర్భంగా ఆస్పత్రి సేవలను నూతన భవనం లోనికి మార్చబడింది. స్మైల్ డెంటల్ హాస్పిటల్ నూతన భవనాన్ని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ప్రారంభించారు. ఆయనతోపాటు తెదేపా నియోజకవర్గ ఇన్చార్జ్ వలవల మల్లికార్జున రావు, మేఘాలయ క్యాడర్ కలెక్టర్ చిట్టూరి రామకృష్ణ, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ ముల్లపూడి బాపిరాజులు ముఖ్య అతిథులుగా విచ్చేశారు.వీరు మాట్లాడుతూ ఈ ఆస్పత్రిలో అన్ని రకాల దంత వైద్య సేవలు అందించబడతాయని, చుట్టుపక్కల ప్రాంతాల వారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పట్టణ తెలుగు యువత అధ్యక్షులు గంధం సతీష్, జనసేన నాయకులు మైలవరపు పెదబాబు, స్మైల్ హాస్పిటల్ వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా చినవెంకన్న బ్రహ్మోత్సవాలు

విశాలాంధ్ర -ద్వారకాతిరుమల: రాష్ట్రంలోనే ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆశ్వయుజమాస తిరు కల్యాణ మహోత్సవాలు ఆదివారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆగమపద్ధతి అను సరించి పాంచాహ్నిక దీక్షతో ఈఉత్సవాలు జరుగుతాయి. ఉదయం శ్రీస్వామివారిని పెండ్లికుమారుడిగా, శ్రీదేవి, భూదేవి,అమ్మవార్లను పెండ్లికుమార్తెలుగా చేశారు. తొలుత ఆలయ ప్రాంగణాన్ని అనేక రకాల సుగంధ పుష్పమాలికలతో, మామిడి తోరణాలతో, అరటిబోదెలతో అలంకరించారు. ఉత్సవాలను సాంప్రదాయబద్ధంగా ఆలయ కార్యనిర్వాహణాధికారి ఎస్.వి.ఎస్.ఎన్.మూర్తి దంపతులు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. స్వామి, అమ్మవార్లను అంతకుముందు ఏర్పాటు చేసిన రజిత సింహాసనంపై ఉంచారు. వేదమంత్రాలు, భాజాభజంత్రీలు మద్య స్వామివారిని, అమ్మవార్లను పెండ్లికుమారుడు, పెండ్లికుమార్తెలుగా చేయడంతో శ్రీవారి బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. రాత్రి 7గంటలకు స్వామిని గజవాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా ఈవో మాట్లాడుతూ ఈనెల17 గురువారం రాత్రి 9గంటలకు స్వామి దివ్యకళ్యాణ మహోత్సవం, 18న రథోత్సవం జరుగుతుం దన్నారు. కళ్యాణమహోత్సవాలు సందర్భంగా ఆలయంలో వివిధ సాంస్కృత కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. కళ్యాణమహోత్సవాలు సందర్భంగా ఆలయంలో ప్రతిరోజు జరిగే నిత్యార్జిత కళ్యాణం, ఆర్జిత సేవలు రద్దుచేసినట్లు ఈవో తెలిపారు.ఆలయ ఏఈవో పతికి నటరాజ్, ఆలయ సూపరింటెండెంట్ గోవాడ సుబ్రమణ్యం, అయినంపూడి రమణరాజు, ఆలయ ప్రధాన అర్చకులు పెద్దింటి రాంబాబు, దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

రావులమ్మకు వెండి గరగ బహూకరణ

విశాలాంధ్ర - జగ్గంపేట : గ్రామ దేవతగా పిలవ బడే జగ్గంపేట శ్రీ రావు లమ్మ తల్లికి ఆలయ ధర్మ కర్తలు వెండి గరగను చేయించి స్థానిక ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ దంపతుల చేతుల మీదుగా శనివారం అమ్మవారికి సమర్పి ంచారు. విజయదశమి పురస్కరించుకుని నెహ్రూ దంపతులు, టీడీపీ కాకినాడ జిల్లా అధ్యక్షులు జ్యోతుల నవీన్ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మకర్తలు మాట్లాడుతూ ఎంతో పవిత్రమైన విజయదశమి రోజున రావులమ్మ అమ్మవారికి వెండి గరగను ఎమ్మెల్యే దంపతుల చేతుల మీదుగా బహూకరించామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఎస్‌వి ఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, జీను వెంకట్రావు, జీను పెద్ద రాంబాబు, జీను మణిబాబు, దేవరపల్లిమూర్తి, దాపర్తి సీతారామయ్య, జీను సోంబాబు, జీను సత్తిబాబు, గెద్దమూరి బాబ్జి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ నూతన బస్సును ప్రారంభించిన ఎమ్మెల్యే సత్యానందరావు

విశాలాంధ్ర - రావులపాలెం : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రోడ్డు రవాణా సంస్థ పై ప్రత్యేక దృష్టి సారించిందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తెలిపారు. ప్రయాణికుల ఇక్కట్లు తీర్చేందుకు ప్రభుత్వం కొన్ని నూతన బస్సులను అందుబాటులోకి తెచ్చిందని అందులో భాగంగా రావులపాలెం డిపోకు వచ్చిన నూతన బస్సులను ఆదివారం ఎమ్మెల్యే సత్యానందరావు సంస్థ అధికారులతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భ ంగా ఆయన మాట్లాడుతూ రావులపాలెం డిపోకు అయిదు నూతన బస్సులు వచ్చాయని అలాగే మరో అయిదు నూతన లగ్జరీ బస్సులు కూడా అందుబాటు లోకి వస్తాయని చెప్పారు. అలాగే ఎన్నికల ముందు హామీ మేరకు మహిళ లకు ఉచిత బస్సు ప్రయాణంపై కూడా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టి పెట్టారని త్వరలోనే హామీని అమలు చేస్తామని సత్యానందరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో బండారు బుల్లితాత, చిక్కట్ల అబ్బు, కడియం చిన్న, తమ్మన భాస్కరరావు మరియు తదితరులు పాల్గొన్నారు.

మోటార్ సైకిల్ ఢీకొని వృద్ధుడి మృతి

- తీరంలో జోరుగా అక్రమ మద్యం అమ్మకాలు
- పట్టించుకోని అధికారగణం

విశాలాంధ్ర - కాట్రేనికోన : మోటార్ సైకిల్ ఢీకొట్టిన ప్రమాదంలో కాట్రేనికోన మండలం, పల్లం శివారు గోపాలరావు పేటకు చెందిన అయితా బత్తుల స్వామి అక్కడికక్కడే మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే ఆదివారం మధ్యాహ్నం స్థానికంగా రోడ్డుపై నడిచి వెళ్తున్న స్వామిని వెనుక నుండి మోటార్ సైకిల్ ఢీకొట్టడంతో మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. పల్లం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తప్ప తాగి మోటార్ సైకిల్ పై వెళుతుండగా ఈ ప్రమాదం జరిగినట్లు తెలిసింది. ఈ మేరకు కాట్రేనికోన పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు నమోదైంది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఇది ఇలా ఉండగా దసరా సందర్భంగా యానాం నుండి వచ్చిన అక్రమ మద్యంతీర గ్రామాల్లో విచ్చలవిడిగా అమ్ముతుండడంతో ప్రమాదాల సంభవిస్తున్నాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. బహిరంగ అక్రమ మద్యం విక్రయాలు జరుగు తున్న ఎక్సైజ్, పోలీస్ అధికారులు తమకెందుకులే అని పట్టించుకోకుండా చోద్యం చూస్తున్నారు అని, స్థానిక అధికారులకు ముడుపులు అందుతున్నాయని ఆరోపిస్తున్నారు. యానాం నుండి వీరబాబు అనే వ్యక్తి అక్రమంగా మద్యం తరలించి తీర గ్రామాలలో అమ్మకాలు చేస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. యానం అక్రమ మద్యం అమ్మకాలు నిరోధించి గ్రామాల్లో కొట్లాటలు, ప్రమాదాలు నివారించాలని స్థానికులు కోరుతున్నారు.

పంచరామ కార్తీక ఉత్సవాలకు అంకురార్పణ

విశాలాంధ్ర-కాట్రేనికోన : పంచరామ క్షేత్రముగా ప్రసిద్ధి చెందిన సామర్లకోట భీమేశ్వర స్వామి ఆలయంలో కార్తీక మహోత్సవాలకు ఆదివారం అంకు రార్పణ చేశారు. ఆలయ ఈవో బళ్ల నీలకంఠం యజ్ఞకర్తగా, అర్చకులు రాంబాబు శర్మ, వెంకన్న శర్మ, వినయ్ శర్మ, మూర్తి, వేద పండితులు, సోమేశ్వర శర్మ, విశేష పూజలు చేశారు. పందిరిరాట పూజలు నిర్వహించారు. బాలత్రిపుర సుందరి సమేత భీమేశ్వర స్వామికి కార్తీక మాసం ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేపట్టినట్లు ఈవో తెలిపారు.

బాధిత కుటుంబానికి ఎస్టీయూ చేయూత

విశాలాంధ్ర - కాకినాడ : 13న ఇటీవల మరణించిన ఎస్టీయూ పెదపూడి మండల మాజీ అధ్యక్షులు వంగా సూర్రెడ్డి కుటుంబ సభ్యులకు ఎస్టీయూ అభయ్ ద్వారా 2 లక్షల చెక్కును వారి కుటుంబ సభ్యులకు ఎస్టీయూ కాకినాడ జిల్లా అధ్యక్షులు మొర్త శ్రీనివాస్, ఎస్టీయూ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షులు పోతంచెట్టి దొరబాబు వారి చేతుల మీదుగా బిక్కవోలు నందు అందజేశారు. వంగా సూర్రెడ్డి ఎస్టీయూ సంఘ నాయకుడిగా ఉపాధ్యా యులకు చేసిన సేవలను ఎస్టీయూ సీనియర్ నాయకులు పి సుబ్బరాజు మాటాడారు. ఎస్టీయూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎస్టీయూ రాష్ట్ర జిల్లా, పెదపూడి మండల నాయకులు, అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొని ఆయనకు ఘనమైన నివాళులర్పించారు.

రాష్ట్ర కార్యదర్శి యు. శ్రీను, పాము శ్రీనివాసరావు, బోనం గంగాధర్, సిద్ధార్థ ప్రసాద్ పెదపూడి మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, పోతురాజు సాయి వెంకటేశం, వీఎ సుబ్బారావు, కార్యక్రమంలో ఆర్థిక కార్యదర్శులు శెశెట్టి సత్యనారాయణ, నేరేడుమిల్లి సత్యనారాయణ, బండారు శ్రీనివాసరావు, ఖ విజయలక్ష్మి, జ్యోతి, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

ప్రజలకు అప్రమత్త సూచనలు : సీఐ

విశాలాంధ్ర - కపిలేశ్వరపురం : అంబేద్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం. మండ పేట రూరల్ పోలీస్ స్టేషన్ సీఐ దొర రాజు ఆదేశాల మేరకు అంగర ఎస్సై డి రవికుమార్ ఆధ్వర్యంలో ప్రజలకు పోలీసువారి అప్రమత్త సూచన ప్రజలు బస్సులలో, షేర్ ఆటోలలో ప్రయాణించినప్పుడు మహిళా నేరగాళ్లు, మనతోనే ప్రయాణిస్తూ మహిళల బ్యాగులలోని, ఒంటిపై గల విలువైన ఆభరణములపై కన్నేస్తారు. సాధారణంగా వారు ఇద్దరు లేదా అంతకంటే ఎక్కువ మంది మనలను అనుసరిస్తూ వారంతా సాధారణ ప్రయాణికులు మాదిరి వారు ఒక కుటుంబంలా ప్రవర్తిస్తారు. అదను చూచి బ్యాగును కత్తిరించి గాని, ఒంటిపై గల ఆభరణాలను మనకు తెలియకుండా నేర్పుగా తెంపి దొంగతనం చేస్తారు. వారి పని పూర్తైన వెంటనే దగ్గరలో ఆటో నుండి గాని, బస్సు నుండి గాని దిగిపోతారు. అక్కడి నుండి కారులో గానీ, ఆటోలో గానీ, బస్సులో గానీ ఉడాయిస్తారు.

ప్రయాణికులు పాటించాల్సిన జాగ్రత్తలు : 1) మన చుట్టూ ఉండే వారిని గమనించాలి. 2) మన వస్తువుల పట్ల మనకి జాగ్రత్త ఉండాలి. 3) ఫోన్లో నిమగ్నం అయిపోవడం కూడా ఇబ్బంది. 4) అపరిచితుల పట్ల అప్రమత్తుగా ఉండాలి. 5) మన అజాగ్రత్త-మన శత్రువు. సీఐ మండపేట రూరల్.

మొక్కుబడి చెల్లించిన ఎమ్మెల్యే నల్లమిల్లి

విశాలాంధ్ర - రంగంపేట : ఎమ్మెల్యేగా నల్లమిల్లి రామకృష్ణారెడ్డి విజయం సాధించడంతో టిడిపి సీనియర్ నేత మాచవరపు నారా యణరావు సత్యవతి దంపతులు బూరెలతో, మత్స్య దుర్గారావు, వెలు గుబంటి సత్తి బాబు కుటుంబ సభ్యులు నాణాలు తులాభారం ఇచ్చి తమ మొక్కుబడి చెల్లించారు. ఆదివారం రంగంపేట మండలం పాత వీరంపాలెం శ్రీ దేవీ అమ్మవారు ఆలయంలో ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మహాలక్ష్మి దంపతులు పార్టీ నేతల మొక్కుబడి చెల్లించారు. కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా తోరాటి జయంతి

విశాలాంధ్ర - కపిలేశ్వ రపురం : అంబే ద్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వ రపురం మండలం ఘనంగా తోరాటి 98వ జయంతి, కపిలేశ్వర పురం మండలం అంగరలో ఆదివారం కామ్రేడ్ తోరాటి లక్ష్మణమూర్తి 98వ జయంతిని అంగర, పడమర ఖండ్రిక గ్రామాల ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. స్వాతంత్ర అనంతరం పేదలకు భూములు పంచాలంటి తెలంగాణలో సాగిన సాయుధ పోరాటంలో అంగరకు చెందిన తోరాటి లక్ష్మణమూర్తి పాల్గొన్నారు. అక్కడ పోలీసుల కాల్పుల్లో వీరమరణం పొందారు. అప్పటి నుంచి గ్రామంలో లక్ష్మణమూర్తి జయంతిని ఇరు గ్రామాల ప్రజలు ఘనంగా జరుపుకుంటు న్నారు. ఆదివారం స్థానిక తోరాటి లక్ష్మణమూర్తి విజ్ఞాన కేంద్రం వద్ద అమరవీరుల స్మారక స్థూపం వద్ద నివాళి అర్పించారు. అంగర, పడమర ఖండ్రిక, గ్రామాల సర్పంచ్లు వాసా కోటేశ్వరావు, తిరునాతి ఆదిలక్ష్మి, ఉప సర్పంచ్ యర్రా వీరన్నబాబు, విజ్ఞాన కేంద్రం నిర్వాహక కమిటీ నాయకులు పెద్దింశెట్టి లక్ష్మణమూర్తి ఆధ్వర్యంలో జయంతిని నిర్వహించారు. ఇరు గ్రామాల ప్రముఖులు ప్రజా సంఘాల నాయకులు జిత్తుక మల్లికార్జునుడు, ముత్తా అబ్బు, పసలపూడి కృష్ణ,ఆటో యూనియన్మా నాయకులు మాట్లా డుతూ లక్ష్మణమూర్తి అంగర గ్రామానికి చెందినవారు కావడం గర్వకారణ మన్నారు. కార్యక్రమంలో ఇరు గ్రామాల ప్రముఖులు పాల్గొన్నారు.

అమ్మవారికి కుంకుమ అర్చన

విశాలాంధ్ర-కరప : కరప మండలం కొంగోడు గ్రామంలో శరన్నవరాత్రులలో భాగంగా అమ్మవారికి సహస్ర కుంకుమ అర్చన చేయుట జరిగిందని మండల గ్రామ రెవెన్యూ అధికారి ఎం కిషోర్ తెలిపారు. తమ ఇంటి ఆడపడుచుగా కొలిచే గ్రామ దేవత ధన మహాలక్ష్మి అమ్మవారిని చిరంజీవి చక్రవర్తి దంప తులు అమ్మవారికి ఆభరణాలతో అలంకరణ చేసి భక్తిశ్రద్ధలతో విశేషంగా పూజలు జరిపించి కొలుచుదు జరిగిందని కిషోర్ తెలిపారు. ప్రతి సంవత్సరం ధన మహాలక్ష్మిని అత్యంత వైభవంగా తీర్చిదిద్ది గ్రామంలోని శరన్నవరాత్రులలో పట్టు వస్త్రాలు సమర్పించి ఆడపడుచులను గౌరవిస్తారని ఆయన పేర్కొన్నారు.

అంతర్ జిల్లాల దొంగల ముఠా అరెస్ట్

విశాలాంధ్ర-గండేపల్లి: గత కొంతకాలంగా దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్జిల్లా దొంగల ముఠాకు సంబంధించిన నలుగురు మహిళలు, ఒక వ్యక్తిని అరెస్ట్ చేసి వారి వద్ద నుండి సుమారు 5 లక్షల రూపాయల విలువైన 100 గ్రాముల బంగారం, 4 సెల్ ఫోన్లు, ఒక కారును స్వాధీనం చేసుకున్నట్లు జగ్గంపేట సీఐ వై ఆర్ కె శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా సీఐ మాట్లా డుతూ జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు పెద్దాపురం సబ్ డివిజన్ పోలీస్ అధికారి శ్రీహరి రాజు ఆధ్వర్యంలో ఇటువంటి దొంగతనా లకు పాల్పడుతున్న వ్యక్తులపై నిఘా పెట్టడం జరిగిందని కావున ప్రయాణికులు బస్సుల్లో గాని ఆటోల్లో గాని ప్రయాణించేటప్పుడు చుట్టుపక్కల వారిని గమనించాలని, వారు అంతా కుటుంబ సభ్యుల్లా మన వద్దనే ఉండి, మనం ఏమరపాటుగా ఉన్న సమయంలో మన దగ్గర ఉన్నటువంటి విలువైన వస్తువులు అపహరించు కుపోయే ప్రమాదం ఉందని, కాబట్టి ప్రయాణికులు మెళకువగా ఉండాలని సిఐ అన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండుకు తరలించడం జరిగిందని సిఐ అన్నారు. ఈ కార్యక్రమంలో వారి వెంట గండేపల్లి ఎస్సై శివ నాగబాబు ఏఎస్ఐ చంద్రశేఖర్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

కరపలో భారీ అన్నదానం

విశాలాంధ్ర-కరప : కరప గ్రామంలో విజయదశమిని పురస్కరించుకుని మెరకవీధి దుర్గమ్మ గుడి వద్ద భారీ అన్నదానాన్ని ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాటు చేశారు. ఉదయం నుండి సాయంత్రం వరకు ఈ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించిన వేలాదిమంది భక్తులు పాల్గొని అన్న ప్రసాదాలను స్వీకరిం చారు. గత 70 సంవత్సరాలుగా ఈ కార్యక్ర మాన్ని నిర్వహిస్తున్నామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. సుమారు రెండు నుండి మూడు వేల వరకు కార్యక్రమంలో పాల్గొన్నారు.

త్రి రత్న బుద్ధ విహార్‌లో ధమ్మ దీక్షా వేడుకలు

విశాలాంధ్ర - అమలాపురం : అశోక ధర్మచక్ర పరివర్తన దీవస్ (విజయ దశమి)డా అంబేడ్కర్ 68వ ధమ్మ దీక్షా వేడుకలు త్రి రత్న బుద్ధ విహార్ మరియు బివిఎస్ఐ సంయుక్త నిర్వహణలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమలో తొలుత, బుద్ధ పూజ, బుద్ధ వందనం అనంతరం, నాగాబత్తుల ప్రసాదరావు అధ్యక్షత వహించారు. ఈసభలో డా పిల్లి రాంబాబు బుద్ధుని ప్రవచనం అశోక విజయ దశమి, విశిష్టతను తెలిపారు. బివిఎస్ఐ జిల్లా అధ్యక్షులు రామ్ బోధి కాశి, శంఢ అశోకుడు, కళింగ యుద్ధం తరువాత, యుద్ధంలో రక్తపుటేరులు, చూచి పశ్చాతాపం చెంది తనకున్న ఆస్తిని ధనాన్ని రాజ్యంలో వున్న ప్రజలందరికీ 10 రోజులలో పంచిన పదిరోజుల పండగానే "విజయదశమి "అశోక ధర్మ చక్ర పరివర్తన, దినంగా దసరాగా జరుపుకుంటారని తెలిపారు. పెనుమాల్ చిట్టి బాబు, ఎంఏకె భీమారావు, యు శ్యామలరావు, డి సూర్యనారాయణ, డి నాగేశ్వరావు, కె రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి దుద్దులు బహుకరణ

విశాలాంధ్ర-దేవరపల్లి: దేవరపల్లి బాలదుర్గమ్మకు విజయదశమి మహోత్సవాలు ముగింపు సందర్భంగా దేవరపల్లి ఎంపీపీ కెవికె దుర్గారావు వెంకట లక్ష్మీ దంపతులు 55 వేల రూపాయలు విలువ చేసి బంగారు దుద్దులను బహుకరించారు. అమ్మవారికి అభిషేకాలు కుంకుమ పూజలు వివిధ రకాల పూజలు నిర్వహించారు. కెవికె దుర్గారావు దంపతులు ఆలయ కమిటీ సభ్యులకు దుద్దులను అందజేసి అమ్మవారికి అలంకరించారు కార్యక్రమంలో కుప్పాల చంద్రకాంత్ రాధా దంపతులు ఎంపీపీ బంధువులు అభివృద్ధి కమిటీ చైర్మన్ పైడికొండల సత్యనారాయణ కోశాధికారి కామిశెట్టి దుర్గారావు, సభ్యులు పైడికొండల శివయ్య, పైడికొండ వెంకటేశ్వరరావు, గారపాటి అప్పారావు, పిన్నమ్మని వెంకటకృష్ణ, కామిశెట్టి మంగ, మాతు సీత, గల్లా నాయుడు, కామిశెట్టి ధర్మయ్య, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

బైక్ పై నుంచి జారిపడి మహిళ మృతి

విశాలాంధ్ర-సామర్లకోట : సామర్లకోట మండలం మాధవపట్నం మార్గ మధ్యలో రోడ్డు గుంతల్లో పడి తలకు గాయమై మహిళ మృతి చెందిన ఘటన ఆదివారం ఉదయం చోటుచేసుకుంది. జార్జ్ పేట నుంచి పెద్దాపురం బైక్ పై భార్య భర్తలు ఇద్దరూ వెళ్తుండగా రోడ్డు మధ్యలో ఉన్న గుంతలో బైక్ పడడంతో బైక్ పై నుంచి రోడ్డుపై పడడంతో తలకు తీవ్ర గాయమై దొంతన ఆదిలక్ష్మి (60) అనే మహిళ అక్కడికక్కడే మృతి చెందింది. సామర్లకోట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

ముగిసిన దసరా ఉత్సవాలు

విశాలాంధ్ర- పెరవలి : గత పది రోజులుగా పెరవలి మండలంలోని వివిధ గ్రామాలలో కొలువై పూజలు అందుకున్న దుర్గమ్మలును ఆదివారం బ్యాండ్ మేళాలు డీజేలు తీన్మార్ డప్పులతో యువతీ యువకులు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని ఘనంగా వీడ్కోలు పలుకుతూ గోదావరిలో నిమజ్జనం చేశారు. ముక్కామల గ్రామంలో దసరా శరన్నవరాత్రి వేడుకలలో భాగంగా వేండ్ర వారి వీధిలో నెలకొల్పిన పుంతలో ముసలమ్మ అమ్మవారి నిమజ్జన కార్యక్రమం తాళ్ల గూడెంలో నెలకొల్పిన దుర్గమ్మ నిమజ్జనం పెద్ద వీధిలో చింతాలమ్మ గుడి వద్ద నెలకొల్పిన దుర్గమ్మ నిమజ్జనాలు ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

విశాలాంధ్ర - ఆలమూరు : పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని, అందుకు తమ వంతుగా మొక్కలు నాటాలని పలువురు వక్తలు సూచించారు. ఆదివారం మండల కేంద్రమైన ఆలమూరులో మండల కాపు సంఘం అధ్యక్షులు డాక్టర్ చల్లా ప్రభాకర్ రావు ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూమిపై మానవాళి మనుగడకు ప్రకృతి సమతుల్యత ఎంతో అవసరమని పేర్కొన్నారు. అందువల్ల అడవులు, చెట్లు నరికివేత మానుకోవాలని, లేకుంటే భావితరాలకు పెను ప్రమాదం సృష్టించిన వారమవుతామని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ చల్లా సీతామహాలక్ష్మి భూషణం, రామాంజనుల శేషగిరిరావు, చల్లా నానాజీ,డిపి రావు, సిరిగినేటి పట్టాభి, చీపురుపల్లి గణేష్, గన్ని బాబి, ఎలుగుబంటి భూరయ్య, చల్లా సత్తిబాబు పాల్గొన్నారు.

అభ్యుదయ భావి సాయిబాబా

విశాలాంధ్ర - అమలాపురం : ఆయన ధైర్యం అనంతం ఆయన ఆత్మవిశ్వాసం ఆసేతు హిమాచలం కష్టాన్ని స్వీకరించి సుఖాన్ని చీదరించుకున్న అభ్యుదయ భావి తన పిడుగుల్లాల్ని అక్షర తూటాలకు భీతిల్లిన నేతలు కక్షగట్టి పదేళ్ల నాగపూర్‌లోని అండర్ గ్రౌండ్ జైల్లో కటిక చీకటి తప్ప వెలుగు లేని చోట బంధించి చిత్రహింసలు పెట్టినా మొక్కవోని ధైర్యంతో న్యాయపోరాటం చేసి జైలు గోడల్ని చీల్చుకు వచ్చిన అక్షర సూర్యుడు ప్రొఫెసర్ గోకర కొండ నాగ సాయిబాబా. జైలు జీవితంలో పాడైన అనారోగ్యంతో పోరాడలేక ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కానరాని లోకాలకు వెళ్లిపోయారు. ప్రొఫెసర్ గోకరకొండ నాగ సాయిబాబా తన కలం బలంతో సమాజంలో జరుగుతున్న రుగ్మతలు, అసమానతలు, అన్యాయాలపై పదునెక్కిన కలంతో ఎలుగెత్తి చాటిన అక్షర సైనికుడు ఆయన. సామ్రాజ్య వాద కుహనా రాజకీయ వాదులకు అదే పాలకులకు కంట గింపుగా మారి ఒక అక్షరం పదివేల సైన్యంబు అన్న నార్ల వారి ఆర్యోక్తి తగ్గట్టుగా సాయిబాబా రచనలు పదునెక్కిన ఈటెల్లా తగలటంతో అప్పుడే ఆయన్ని అంతమొందించడానికి జరిగిన కుట్రకు బీజమైందని చెబుతారు. కోనసీమ జిల్లా అమలాపురం మండలం నల్లమిల్లి గ్రామానికి చెందిన సాయిబాబా పుట్టుకతోనే పోలియో సోకి వికలాంగుడయ్యారు. ప్రాథమిక విద్యాభ్యాసం నల్లమిల్లిలోనూ, హైస్కూల్ విద్యాభ్యాసం అమలాపురం హైస్కూల్‌లోనూ సాగిందని చెబుతున్నారు. ఆయన కుటుంబం కొన్నేళ్ళు అమలాపురం గాంధీ నగర్‌లో నివాసం వున్నట్లు చెబుతారు. తరువాత ఆయన కుటుంబం ఎక్కడ ఉన్నదీ తెలియదని స్వగ్రామ స్తులు చెబుతున్నారు. హైదరాబాద్ నిమ్స్‌లో మరణించిన సాయి బాబా అంత్యక్రియలు స్వగ్రామం నల్లమిల్లి లో నిర్వహిస్తారా లేదా హైదరాబాద్‌లో నిర్వహి స్తారో సమాచారం లేదని సాయి బాబా కుటుంబ బంధువు ఒకరు తెలిపారు. కోనసీమతో ప్రత్యేకమైన అనుబంధమున్నది. ప్రతి గ్రామంలో సాయిబాబా క్లాస్‌మేట్ స్నేహితులు ఎందరో వున్నారు. అనేక మంది మీడియాకు ఫోన్లు చేసి సాయిబాబాతో వున్న అనుబంధాన్ని నెమరు వేసు కుంటూ ఎంతో మేధస్సు వున్న వ్యక్తి సాయిబాబాని కొల్పోయా మం టూ కన్నీరు మున్నీరు అయ్యారు. నాగపూర్ అండర్ గ్రౌండ్ జైలులో వికలాంగుడైన సాయిబాబాను వెలుగు అన్నది చూడనివ్వక కటిక చీకటిలో పదేళ్ళ చిత్ర హింసలు పెట్టారని పలువురు మిత్రులు ఫోన్ చేసి చెప్పి ఆవేదన చెందారు.

ప్రమాదాల రోడ్లు పట్టించుకోరా : సీపీఐ ఎంఎల్ వినోద్ మిశ్రా

విశాలాంధ్ర - ఏలేశ్వరం : ప్రమాద భరితంగా ఉన్న రోడ్డును పట్టించుకోరా రోడ్డుని వెంటనే నిర్మిస్తారా లేక గడ కట్టమంటారా అంటూ స్థానిక సిపిఐ ఎంఎల్ వినోద్ మిశ్రా పార్టీ ఆర్గనైజింగ్ కమిటీ ఆధ్వర్యంలో తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ మేరకు స్థానిక వినోద్ మిశ్రా నగర్‌లో రమణయ్యపేట నుండి జె అన్నవరం వరకు ఉన్న ఆర్ అండ్ బి రహదారిని వెంటనే నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ ఆర్గనైజింగ్ కమిటీ సభ్యుడు కొసిరెడ్డి గణేష్ రావు మాట్లాడుతూ సుమారు పది సంవత్సరాల నుండి ఏజెన్సీ ముఖద్వారంగా పిలవబడే ఏలేశ్వరం మండలం రమణయ్యపేట నుండి జె అన్నవరం వరకు గల పది కిలోమీటర్ల రహదారి నిర్మాణం జరగక అనేక ప్రమాదాలు జరుగుతున్నా రెండు జిల్లాల అధికారులు గాని ప్రజాప్రతినిధులకు గాని చీమ కుట్టినట్లయినా అనిపించడం లేదని ఆరోపించారు. సార్వత్రిక ఎన్నికల ముందు టీడీపీ, జనసేన భారతీయ జనతా పార్టీలు పోటాపోటీగా ఈ రహదారి నిర్మించకపోతే గోడ కడతామని పత్రిక ప్రకటనలు, ధర్నాలు, నిరసనలు చేసి నేడు కుటమి అధికారం చేపట్టి నాలుగు నెలలు గడిచినా రహదారి కోసం ఏమి చేశారని అటు ప్రజలు, ప్రయాణికులు సూటిగా ప్రశ్నిస్తున్నారన్నారు. అయితే ఈ రహదారి గుండా వందలాది క్వారీలారీలు నల్ల కంకర, క్వారీ క్రష్షర్ నుండి భారీ లోడుతో వాహనాలు వెళ్లడమే ఈ రహదారి ధ్వంసం కావడానికి కారణమన్నారు. వైసీపీ ప్రభుత్వంలో ఈ రహదారి నిర్మాణం నిమిత్తం రూ.28 కోట్ల 86 లక్షల మంజూరు చేసింది. అయితే ఈ రహదారి నిర్మాణం కోసం టెండర్లు వేసిన కాంట్రాక్టర్ ఈ రహదారికి కుడి, ఎడమవైపున కాలువల నిర్మాణం చేసి సుమారు రూ.22 లక్షల ఆర్అండ్‌బి అధికారుల ప్రోత్సా హంతో డ్రా చేసినట్లు తెలిసిందన్నారు. మరి ఈ వ్యవహారంలో అధికారులు చోద్యం చేస్తున్నారా అంటూ వారు ప్రశ్నించారు. మొన్నటి వరకు పరిపాలన చేసిన వైసీపీకి చెందిన ఒక మాజీ మంత్రి ఈ రోడ్డును కాంట్రాక్టు తీసుకుని డబ్బులు డ్రా చేసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయని, ఈ వ్యవహారంపై సిబిసిఐడి ఎంక్వయిరీ కూటమి ప్రభుత్వం నియమించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారని ఆయన తెలిపారు. అయినా ఆ ప్రభుత్వం ఎందుకు పట్టించుకోవడంలేదని వినోద్ మిశ్రా పార్టీ తరఫున, ప్రజాసంఘాలు నిలదీస్తున్నా యన్నారు. ఈ రోడ్డు గురించి సరైన సమాధానం లిఖిత పూర్వకంగా చెప్పకపోతే అన్ని ప్రజా సంఘాలు అన్ని పార్టీల మద్దతుతో నవంబర్ 04న రోడ్డుపై అడ్డంగా గోడ కడతామన్నారు. ప్రభుత్వానికి చెల్లించవలసిన టాక్సులు ఇంటి పన్నులు కరెంటు బిల్లులు పగ్గెరాలు ఈ రోడ్డు మార్గంలో వెళ్లేవారు అందరూ కూడా చెల్లించ కుండా నిషేధించాలని పిలుపునిస్తూ "ప్రభుత్వానికి చెల్లించవలసిన ట్యాక్సులు కట్టకుండా వ్యతిరేకించండి" అంటూ కర పత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కందుల క్రాంతి కుమార్, పందిరి సుబ్బారావు, కంబాల బాలయ్య, పందిరి ధర్మరాజు, గుమ్మడి కాటంరాజు, సందక శివ, గోనాపు వరలక్ష్మి, గుర్రం నాగేశ్వరి, పచ్చిమళ్ళ సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

దసరా ఉత్సవాల్లో విషాదం

డీజే సౌండ్ గుండె ఆగి ఇద్దరు మృతి

విశాలాంధ్ర - అమలాపురం : అమలాపురం దశమి ఉత్సవాల్లో అపశృతి చోటుచేసుకుంది. కొంకాపల్లిలో డీజేకు నృత్యం చేస్తూ ఆ యువకుడు సొమ్మసిల్లి పడిపోయాడు. అతని వెంటనే ఆసుపత్రి తరలించారు. అయితే యువకుడు మృతి చెందాడు. మరణ వార్త తెలిసిన వెంటనే మంత్రి వాసంశెట్టి సుభాష్ తన ప్రగాఢ సానుభూతి వ్యక్తంచేశారు. డీజే సౌండ్‌కి ఉప్పలగుప్తం మండలం మండలం వాడపర్రు గ్రామం దసరా ఉత్సవాల్లో అపశృతి చోటు చేసుకుంది. డిజె సౌండ్ కారణంగా చప్పిడి మోహన్ రావు సంఘటన స్థలంలో మృతి చెందాడు. డీజే సౌండ్లు ఏర్పాటు వ్యతిరేకిస్తున్న ప్రజానీకం. గ్రామీణ పట్టణ అన్న తేడా లేకుండా ఈ మధ్య డిజె సౌండ్స్ పట్ల యువత వేలం వెర్రిగా ఆకర్షితులవుతున్నారు. దానితో యువతకు ప్రమాదం అని హెచ్చరిస్తున్నా డిజే సౌండ్స్ నిర్వాహకులు 30 థౌజండ్ 50 తౌజండ్ వాట్స్ అంటూ షోస్ జరిగే కొద్ది ఇష్టా రాజ్యాంగా పెంచుకు పోతుందటం ఇళ్లల్లో నివసించేవారు, వృద్ధులు, పిల్లలు వున్నా భారీ సౌండ్స్‌కి భయపడి దండాలు పెడుతున్న వినటం లేదని మహిళలు గొలచేస్తున్నారు. నిర్వాహకులు వారిని కంట్రోల్ చేయటం లేదనీ పరిమిత సౌండ్‌తో డిజె యువతకు ఉత్సాహం ఇస్తున్నా మద్యం మత్తులో యువత అపరిమిత సౌండ్‌కి బాక్సులు ముందుకు వచ్చి డ్యాన్సలు చేస్తూ గుండె ఆగి ప్రాణాలు కోల్పో తుండటంతో ప్రజా రక్షణ కోసం డిజె నీ నిషేధిస్తారా అన్న సందహాలు వ్యక్తం అవుతున్నాయి. పోలీసులు డిజె నిర్వకులపై ఆంక్షలు విధించాలని పలువురు కోరుతున్నారు.

పేదలను ఆదుకుంటున్న జ్యోతులనెహ్రూ ఫౌండేషన్

విశాలాంధ్ర - జగ్గంపేట : నియోజకవర్గంలోని పేద వధువు వివాహ సమయంలో అందిస్తున్న జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ పెళ్లి కానుకను టీడీపీ కాకినాడ జిల్లా అధ్యక్షులు జ్యోతుల నవీన్ పెళ్లి కుమార్తెకు అందజేశారు. జగ్గంపేట మండలం మన్యంవారిపాలెం గ్రామానికి చెందిన నక్క లోవరాజు కుమార్తె లక్ష్మీ ప్రసన్నకు జ్యోతుల బులి స్వామితో శనివారం రాత్రి వివాహమైంది. ఆ వివాహ వేడుకకు నవీన్ హాజరై నూతన దంపతులకు 20 వేల రూపాయలు చెక్కును అందించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ పేద కుటుంబాల ఆడ బిడ్డలను జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ వివాహ సమయంలో ఆదుకుంటుందన్నారు. ప్రతి పేద ఇంటి ఆడబిడ్డ తమ కుటుంబ సభ్యురాలిగా భావించి ఎన్నికల్లో నేను ఇచ్చిన హామీ మేరకు స్వయంగా వివాహ వేదిక వద్ద అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా టిడిపి ఉపాధ్యక్షులు కోర్పు సాయి తేజ, జగ్గంపేట నియోజకవర్గం బిజెపి ఇన్చార్జి దాట్ల కృష్ణ వర్మ, టిడిపి నాయకులు దేవరపల్లి మూర్తి, పోట్రు రాముడు, బొడ్డు బుజ్జి, తదితరులు పాల్గొన్నారు.

ఆదమరిస్తే అంతే సంగతులు.... ఒక వైపు గుంతలు మరోవైపు తుప్పలు

విశాలాంధ్ర - రాజానగరం : నియోజకవర్గ కేంద్రమైన రాజానగరం నుండి వివిధ గ్రామాలకు రహదారులు పై ప్రయాణించలంటేనే ఒకటికి రెండుసార్లు ఆలోచించు కునే పరిస్థితులు నెలకొన్నాయి. మండలంలోని వివిధ రోడ్ల పై ఏర్పడ్డ పెద్ద పెద్ద గుంతలతో ప్రయాణికుల పాట్లు వర్ణనాతీతం. నియోజకవర్గ కేంద్రమైన రాజానగరం నుండి మండలంలోని చక్రద్వార బంధం గ్రామం వెళ్ళే రహదారి పై స్థానిక సెవెంత్ డే స్కూల్ సమీపంలోని మలుపు వద్ద పెద్ద ఎత్తున గోతులు దర్శన మివ్వడంతో పాటు రోడ్డుకి ఇరువైపులా తుప్పలు పెరిగిపోవడంతో వాహన చోదకులు నిత్యం తిప్పలు పడుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డుకు ఇరువైపులా దట్టంగా తుప్పలు,చెట్ల కొమ్మలు పెరగడంతో ఎదురుగా వచ్చే వాహనాలను గుర్తించలేక చిన్నపాటి ప్రమాదాలు సంభవిస్తున్నాయి. అలాగే తుంగాపాడు గ్రామం దాటిన తర్వాత రోడ్డు మధ్యలో పెద్ద పెద్ద గోతులు ఏర్పడ్డాయి. ఈ రోడ్డులో ఆదమరిచి ప్రయాణిస్తే అంతే సంగతులు అన్న రీతిలో గోతులు దర్శనమిస్తున్నాయి. ముఖ్యంగా మలుపుల వద్ద ఎక్కువగా తుప్పలు,చెట్ల కొమ్మలు పెరగడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనపడక ప్రమాదాలు సంభవించేందుకు ఆస్కారం ఉందని,అధికారులు స్పందించి రోడ్డు మార్గంలో ప్రమాదకరంగా మారిన తుప్పలను తొలగించాలని డ్రైవర్లు, ప్రయాణికులు కోరుతున్నారు. మరోపక్క రాజానగరంలోని సాయిబాబా ఆలయం సమీపం లోని వైన్ షాప్ వద్ద అలాగే స్థానిక నూకాలమ్మ ఆలయం వద్ద పాత రహదారి పై గోతులు పడడంతో నిత్యం రాకపోకలు సాగించాలంటే ద్విచక్ర వాహనదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారు.

ఎడిబి రోడ్డు వద్దు ట్రెయిన్ జర్నీ ముద్దు!

మండల కేంద్రమైన రాజానగరం నుండి కాకినాడ నగరాన్ని కలిపే ఏషియన్ డెవలప్మెంట్ బ్యాంక్ (ఎడిబి) రోడ్డు పై ప్రయాణమంటే అటుగా వెళ్ళే ద్విచక్ర వాహనాదారులకు, చిన్న కారులు యజమానులకు, బస్, లారీ డ్రైవర్లులకు, ఉద్యోగాలకు వెళ్లే ఉద్యోగులకి, ప్రతి రోజు ప్రయాణించే ప్రయాణికులకు ముచ్చుచేమటలు పడుతున్నాయనీ పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. ఎడిబి రోడ్డు పై ఏర్పడిన గుంతల్లో ప్రయాణం చేసేకన్న దురమైనప్పటికి రాజమహేంద్రవరం వెళ్లి ట్రెయిన్ జర్నీ చేయడమే సురక్షితమని మనస్సులో మాట వెల్లడించారు. ఎడిబి రోడ్డు నాలుగు లైన్లు విస్తరణ పనులు ప్రారంభించి సుమారు 8 ఏళ్లు గడుస్తున్నప్పటికి ఎడిబిరోడ్డు మాత్రం ఇప్పట్లో పూర్తి చెయ్యరాని, సంబంధిత అధికారులకు చీమ కుట్టినట్టు కూడా లేదని మండిపడ్డారు.

రోడ్డు పనులు తిరిగి ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికైనా ఎన్డీఏ కూటమి ప్రజాప్రతినిధులు,నాయకులు, జిల్లా అధికారులు స్పందించి రోడ్డు పక్కన పెరిగిన తుప్పలను తొలగించేందుకు చర్యలు చేపట్టడంతో పాటు రహదారి నిర్మాణాలు, మరమత్తులు సమస్యలు పరిష్కరించేందుకు కృషి చెయ్యాలని పలువురు డిమాండ్ చేశారు.

సాయిబాబా మృతి భాదాకరం

దివ్యాంగుల నేత నిమ్మకాయల సురేష్

విశాలాంధ్ర - అమలాపురం : అమలాపురం వాస్తవ్యులు మానవ హక్కుల నేత దివ్యాంగుడు అయిన గోకరకొండ నాగ సాయిబాబా మృతి పట్ల దివ్యంగుల మహా సంఘటన్ మాజీ అధికార ప్రతినిధి నిమ్మకాయల సురేష్ సాయిబాబా మృతి పట్ల సంతాపం వ్యక్తం చేయుచున్నాము వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేశారు. ఆయన నేత్రాలు దానం చేయటం, సాయిబాబా భౌతిక కాయాన్ని మెడికల్ కళాశాలకు అందించటం ఆయన కుటుంబ సభ్యుల గొప్పతనం అన్నారు. ప్రొఫెసర్‌గా సేవలు అందించియున్నారు. ఆయన ఉగ్రవాదిగా పరిగణించి జైల్లో పెట్టడం జరిగిందనీ నిర్దోషిగా కోర్టు విడుదల చేయడం జరిగింది. ఆయన మృతి తీరనిలోటని సురేష్ తెలిపారు.

రాజమండ్రిలో తన కొత్త షోరూమ్‌ను ప్రారంభించిన కీర్తిలాల్స్

విశాలాంధ్ర-రాజమండ్రి: ప్రముఖ వజ్రాభరణాల సంస్థ కీర్తిలాల్స్ రాజమండ్రిలో తన 14వ రిటైల్ షోరూమ్ ఏర్పాటు చేసింది. రాజమండ్రి ఏవి అప్పారావు రోడ్డు లోని ఈ షోరూమ్ ను ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవాని, ఆదిరెడ్డి శ్రీనివాస్ అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగర ప్రజలకు అందుబాటులో ఈ తరహా స్టోర్లు రావడం శుభ పరిణామం అన్నారు. మరిన్ని వస్త్ర ఆభరణాల సంస్థలు రాజమండ్రిలో ఏర్పాటు కావాల్సి ఉందన్నారు. కీర్తిలాల్స్ బిజినెస్ స్ట్రాటజీ డైరెక్టర్ సూరజ్ శాంతకుమార్ మాట్లాడుతూ రాజమండ్రి లోది తమ 14వ షోరూమ్ అన్నారు. ఇంటిగ్రేటెడ్ బ్రైడల్ స్టూడియో వధువులకు అనుకూలమైనదిగా రూపొందించమన్నారు. 3200 చదరపు అడుగుల విస్తీర్ణంలో కీర్తిలాల్ షోరూమ్ ఏర్పాటు చేశామ న్నారు. ప్రత్యేకమైన, వినూత్నమైన ఆభరణాలను రూపొందించే నైపుణ్యం కలిగిన డిజైనర్ల బృందంతో కీర్తిలాల్స్ సమకాలీనానికి వివిధ ప్రత్యేక శైలులను కలిగి వుందన్నారు. ఈ స్టూడియోలో సున్నితమైన బ్రైడల్ సెటు, కంకణాలు, నెక్లెస్లు, చెవిపోగులతో సహా విస్తృతమైన బ్రైడల్ ఆభరణాల ఎంపిక ఉందన్నారు. అత్యాధునిక సాంకేతికతతో కూడిన స్టూడియోలో, కస్టమర్లు కొనుగోలు చేయడానికి ముందు వారి ఆభరణాల డిజైన్లను చూడవచ్చునని, ప్రారంభోత్స వాన్ని పురస్కరించుకుని, కీర్తిలాల్స్ విలువ ఆధారిత సేవలపై 50 శాతం తగ్గింపుతో పాటు డైమండ్ ఆభరణాలపై క్యారెట్ కు రూ.12,000 వరకు తగ్గింపును అందిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో కీర్తిలాల్స్ మేనేజింగ్ డైరెక్టర్ టి.శాంత కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ తండ్రికి సత్కారం

విశాలాంధ్ర - పెద్దాపురం : దేవుని సేవలో ప్రతీ ఒక్కరికి మంచి జరగాలంటూ ప్రతీ ఒక్కరి సమస్యలపై దేవునికి మొరపెడు తున్న దైవజనులను క్రైస్తవ సోదరులందరూ తమ సంఘాల ఆత్మీయ తండ్రిని సత్కరించిం చాల్సిన బాధ్యత సంఘం విశ్వాసిగా ప్రతీ ఒక్కరిపై ఉంటుందని పలువురు వక్తలు అన్నారు. ఆదివారం ఫాస్టర్స్ డే సందర్భంగా క్రీస్తు శాంతి ప్రార్ధనా మందిరాల వ్యవస్థాపకులు నంగిన సత్యానందం, సీజీఓం వ్యవస్థాపకులు నంగిన శామ్యూల్ సుదీప్లను మండలంలోని తిరుపతి, దివిలి, చదలాడ, కాండకోటతో పాటు దివిలి శివారు పిఠాపురం మండలం విరవ ప్రార్ధనా మందిరాల్లో సంఘ విశ్వాసులు ఘనంగా సత్కరించారు. దైవజనులు సత్యా నందం, సుదీప్ల మాట్లాడుతూ మానవీయ కోణంలో ఈ సత్కారాలు తప్ప, దేవుని కృప ప్రతీ ఒక్కరిపై ఉండాలని నిత్యం ప్రార్ధనలు చెయ్యడం జరుగుతుందన్నారు. సత్కారాలు, సన్మానాలు దేవుని దీవెనల ముందు ఏపాటివన్నారు. సంఘం సభ్యులు కోరిక కాదనలేకే సన్మానాలకు అంగీకరించాము తప్పా దేవుని దీవెనలకై ప్రతీ ఒక్కరూ నిత్యం ప్రార్ధనా జీవితం గడపాలని కోరారు. ఆయా సంఘాల చర్చిల్లో వారిని సత్కరించారు.

అంబరాన్నంటిన అమ్మ సంబరం

- వాడవాడల, గ్రామగ్రామాన దసరా ఉత్సవాలు
- వివిధ రూపాల్లో పూజలందుకున్న అమ్మవార్లు

విశాలాంధ్ర-పెద్దాపురం : శరన్నవ రాత్రి ఉత్సవాల్లో భాగంగా విజయ దశమి పర్వదినం పురస్కరించుకుని దుర్గమ్మ అమ్మవారి సంబరాలు ఆడంబరంగా జరిపారు. అత్యంత భక్తిశ్రద్దలతో వాడవాడలా, గ్రామ గ్రామానా, వీధి వీధినా అమ్మవార్లకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా కొలుస్తూ భారీ ఊరేగింపులు, సంబరాలు నిర్వహించారు. పెద్దాపురం అర్బన్, రూరల్ ప్రాంతాల్లో అమ్మవార్ల సంబరాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లోని మహిళలు అత్యంత భక్తి శ్రద్దలతో కుంకుమ పూజలు, శమిపూజలు, పూర్ణాహారతి నిర్వహించి అమ్మవార్లను మొక్కుకున్నారు.

భువనేశ్వరి పీఠంలో శమిపూజ, పూర్ణాహుతి :

శరన్నవ రాత్రి ఉత్సవాల ముగింపులో భాగంగా స్థానిక వర్ణుల వారి వీధిలోని వెలసిన భువనేశ్వరి పీఠంలో పీఠాధిపతి చింతా గోపిశర్మ సిద్దాంతి ఆధ్వర్యంలో శమి పూజ, పూర్ణాహుతి ఘనంగా నిర్వహించారు. భువనేశ్వరి అమ్మవారు దశమి పర్వదినాన భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలువురు దంపతులచే కళశస్థాపన, పుష్పాలంకరణ సేవాభాగ్యం నిర్వహించగా విశేష అర్చన, అలంకరణతో పాటు పూర్ణాహుతి, సాయంత్ర జమ్మిచెట్టుకు పూజను నిర్వహించారు. అత్యంత భక్తిశ్రద్ధలతో భక్తులు హాజరై పీఠంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఇష్టానుసారంగా ప్రధాన రహదారిపై వివిధ కార్యక్రమాలు

విశాలాంధ్ర - సీతానగరం: ఇష్టానుసారంగా ప్రధాన రహదారిపై వివిధ కార్యక్రమాల నిర్వహణ. మండలంలో రాజమహేంద్రవరం నుండి సీతానగరం వరకూ గల 24 కిమి ప్రధాన రహదారి నాలుగు లైన్ల రహదారి నిర్మాణం చాలా వరకూ పూర్తి అయినా సంగతి అందరికి తెలిసిందే. అయితే ఈ రహదారి పై ఏ విధమైన అనుమతులు, హెచ్చరికల బోర్డులు లేకుండా ప్రధాన రహదారికి అడ్డంగా వివిధ రకాల కార్యక్రమాలను చేయడం కోసం ఎక్కడి పడితే అక్కడ టెంట్లు వేసి రోడ్డు నిర్బంధం చేసి చేపడుతున్నారు. దీనితో ఈ రోడ్డు పై ప్రయాణం చేయాలి అంటే వాహనదారులు బెంబేలు ఎత్తుతున్నారు. ఒక విధంగా పగలు వాహనదారులు ద్విచక్ర వాహనాలు చూసుకొని ప్రయాణం చేస్తున్నపటికి రాత్రులు ఏ విధమైన హెచ్చరికల బోర్డులు లేకపోవడంతో భారీ వాహనాలు దారి మారడానికి చాలా ఇబ్బందులకు గురి అవుతున్నాయి. దీనిపై అర్ ఎన్ బి, ఆయా గ్రామాల పంచాయితీ అధికారులు సత్వరమే చర్యలు చేపట్టి ఏదైనా పెద్ద ప్రమాదం చోటు చేసుకోక ముందే పటిష్ట మైన భద్రత ప్రమాణాలను పాటించే విధంగా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

నిరుపేద భక్తునికి గృహం నిర్మించనున్న శ్రీ విశ్వ విజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠం

విశాలాంధ్ర - పిఠాపురం : ధర్మో రక్షతి రక్షితః అన్నారు పెద్దలు. అంటే ధర్మాన్ని మనం రక్షిస్తే, ధర్మం మనల్ని రక్షిస్తుంది అన్న దానికి ప్రత్యక్ష ఉదాహరణ పిఠాపురంలోని శ్రీ విశ్వ విజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠం. ప్రస్తుత పీఠాధిపతి డా ఉమర్ ఆలీషా స్వామి వారి తండ్రి పరబ్రహ్మ శ్రీ మొహియద్దిన్ బాద్షా స్వామి వారికి జీవిత చరమాంకం వరకు రిక్షాను నడిపిన రధ సారధి పెదపాటి ధర్మయ్య కాలం చేసినారు. వారి కుమారుడు అయిన రత్నం రాజు నిరుపేద అయిన కారణంగా, తనకు గృహం ప్రసాదించమనీ ప్రస్తుత పీఠాధిపతిని అభ్యర్థించగా, పీఠాధిపతి డా ఉమర్ ఆలీషా, ధర్మయ్య కుటుంబాన్ని ఆదుకోవాలనే ఉద్దేశ్యంతో, వారి తండ్రి చేసిన సేవలకు బదులుగా, అతని కోరిక మన్నించి గృహం నిర్మించాలనే అభ్యర్ధన మేరకు, గృహం నిర్మించి ఇచ్చుట కొరకు, వారి అమృత హస్తములతో శంకుస్థాపన చేశారు. అదే విధంగా ఇటీవల కాలంలో మరణించిన సేవకురాలు అయిన నిరుపేద, మూగ మహిళ గుళ్ళ సూరీడమ్మ అంత్యక్రియలు నిర్వహించుటకు అయ్యే వ్యయాన్ని కూడా పీఠాధిపతి డా ఉమర్ ఆలీషా స్వామి వారు సహాయం చేశారు. పీఠాధిపతి సోదరుడు అహ్మద్ ఆలీషా మరియు మెంటే సురేష్ పాల్గొన్నారు.

శరన్నవరాత్రి ఉత్సవాల్లో ఎమ్మెల్యే అనంతలక్ష్మి

విశాలాంధ్ర-కరప : కరప మండలం పెనుగుదురు గ్రామంలో విజయదశమి శరన్నవరాత్రి ఉత్సవాలలో కాకినాడ రూరల్ మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి సత్యనారాయణమూర్తి పాల్గొని అమ్మవారికి పూజలు నిర్వహించారు. కలసాలు నెత్తిన పెట్టుకుని పెద్ద ఎత్తున మహిళలు ఈ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అనంతలక్ష్మి మాట్లాడుతూ మహిషాసుర మర్దినిగా అవతరించిన అమ్మవారు మహిషాసురను వధించి ప్రజలను కాపాడడం ద్వారా విజయానికి చిహ్నంగా విజయదశమిని జరుపుకుంటామని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పిల్లి సత్యనారాయణమూర్తి, జనసేన పార్టీ మండల అధ్యక్షులు బండారు మురళి, పులపకూర శుభ మహేష్, చీపురుపల్లి జయేంద్ర బాబు, కన్నారావు, వై సుకుమార్, కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.

మర్రెడ్డి చేతుల మీదుగా మండి హౌస్ ప్రారంభం

విశాలాంధ్ర - పిఠాపురం : విజయదశమి సందర్భంగా పిఠాపురం పట్టణంలో స్థానిక కోటగుమ్మం సెంటర్లో పిఠాపురం నియోజకవర్గం జనసేన పార్టీ ఇన్‌ఛార్జ్ మర్రెడ్డి శ్రీనివాస్ మండి హౌస్ ఫ్యామిలీ రెస్టారెంట్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయదశమి ఎంతో పవిత్రమైన దినమని చెడుపై విజయం సాధించిన నాడు విజయదశమి పండుగ చేసుకుంటామన్నారు. ఈరోజు పిఠాపురం పట్టణంలో మొట్టమొదటి సారిగా ప్రారంభించిన మండి హౌస్ ఫ్యామిలీ రెస్టారెంట్ తన చేతుల మీదుగా ప్రారంభించడం చాలా ఆనందంగా ఉందన్నారు. పిఠాపురం పట్టణంలో నిత్యం వివిధ ఆలయాల వద్ద అన్నదానం జరుగుతున్న, యువత మాత్రం బిరియానీలు తినడానికి ఆసక్తి చూపుతున్నారన్నారు. కార్యక్రమంలో పిఠాపురం జనసేన నాయకులు సూరవరపు సురేష్, మురాలశెట్టి సునీల్, మాదేపల్లి శ్రీను (రాయవరం శ్రీను), సారిపల్లి నాగేశ్వరరావు, కేతినిడి గౌరీ మణి, కొండేపూడి శివ, పల్నాటి మధు తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు ఆరోపణలు కాదు... బహిరంగ చర్చకు సిద్ధమా?

బాస్కెట్ బాల్ అసోసియేషన్ ఇన్ ఆంధ్రప్రదేశ్‌కి సవాల్

విశాలాంధ్ర - పిఠాపురం : బాస్కెట్ బాల్ అసోసియేషన్ ఇన్ ఆంధ్రప్రదేశ్ ప్రెసిడెంట్ టి చెంగల్రాయనాయుడు మరియు జనరల్ సెక్రటరీ గన్నమని చక్రవర్తి లు తాము చేసిన తప్పులు తనపై నెట్టేయడం సమంజసం కాదని తూర్పుగోదావరి జిల్లా బాస్కెట్ బాల్ అసోసియేషన్ (రి.నెం.1299/1994) జనరల్ సెక్రటరీ మలిరెడ్డి ఉపేంద్ర ఆదివారం పత్రికలకు విడుదలచేసిన ప్రకటనలో పేర్కొన్నారు. రామచంద్రాపురంలో శుక్రవారం చెంగల్రాయనాయుడు మీడియా సమావేశంలో బోగస్ సర్టిఫికెట్స్ సృష్టి కర్తని ప్రక్కన పెట్టుకొని సుమతీ శతకాలు చెప్పడం హాస్యాస్పదమన్నారు. రామచంద్రాపురం పట్టణం నుండి నకిలీ జనన ధ్రువపత్రాలతో క్రీడాకారులు, క్రీడాకారిణులు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్న మాట వాస్తవమేనని క్రీడాకారులు సమర్పించిన బర్త్ సర్టిఫికెట్స్ నకిలీవి అని అధికారులు సైతం ధ్రువీకరించారని వాటికి సంబంధించిన డాక్యుమెంట్స్ ఉన్నాయని ఉపేంద్ర తెలిపారు. తమ అసోసియేషన్ పై వస్తున్న ఆరోపణలు క్రీడాకారులపై ప్రభావం చూపిస్తాయని చెప్పడం దెయ్యాలు వేదాలు వల్లించడమేనని మీరు చేస్తున్న తప్పులకు 09-12-2022 నుండి 12-12-2022 వరకు కేరళ రాష్ట్రం కాలికట్‌లో జరిగిన 72 వజూనియర్ నేషనల్ బాస్కెట్ బాల్ ఛాంపియన్ షిప్‌లో పాల్గొనే ఆంధ్రప్రదేశ్ బాలుర జట్టుకు అర్హత కలిగిన తన కుమారులను కాదని అర్హత లేని క్రీడాకారులను ఎంపిక చేయడంపై ఏలూరు జిల్లా నూజివీడుకు చెందిన ముగ్గురు తల్లిదండ్రులు ఆంధ్రప్రదేశ్ హైకోర్టు (I A. 1 OF 2022 & W P No. 33605 OF 2022)ని ఆశ్రయించగా సదరు హైకోర్టు వారు బాస్కెట్ బాల్ అసోసియేషన్ ఇన్ ఆంధ్రప్రదేశ్ వారి నిర్ణయాన్ని తప్పుబడుతూ అర్హత కలిగిన క్రీడాకారులకు (పిటిషనర్స్)కు అర్హతలు ఉన్నాయని వారికి అవకాశం ఇవ్వాలని ఆర్డర్స్ ఇచ్చినది నిజమా కాదా? మీపై నకిలీ బర్త్ సర్టిఫికెట్స్ కేసు ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో (రిట్ పిటిషన్ నెం 8581 OF 2021) విచారణ జరుగుతుంది నిజమా కాదా? అని ప్రశ్నించారు. జిల్లా టీమ్స్ సెలక్షన్స్‌కి చాలా మంది క్రీడాకారులు వస్తుంటారని బర్త్ సర్టిఫికెట్స్‌ని సెలక్షన్ కమిటీ ప్రాథమికంగా చూసి ఎంపికలలో పాల్గొనే అవకాశం ఇస్తారని ఎవరైనా అవి బోగస్ సర్టిఫికెట్స్ అని ఫిర్యాదు చేస్తేనే అప్పుడు వెరిఫికేషన్స్ చేస్తారని ఉపేంద్ర తెలిపారు. 2017 నుండి 2019 వరకు తూర్పుగోదావరి జిల్లా బాస్కెట్ బాల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ మరియు రాష్ట్ర జనరల్ సెక్రటరీగా కొనసాగిన చక్రవర్తి అప్పుడు బోగస్ సర్టిఫికెట్స్ పై ఎందుకు నోరు మెదప లేదని, రాష్ట్ర స్థాయిలో మీ హయాంలో ఎప్పుడైనా ఇటువంటి వెరిఫికేషన్స్ చేసారా అని ప్రశ్నిస్తున్నాను అన్నారు. ఆంధ్రప్రదేశ్ విడిపోయిన తరువాత మీరు ఏమి వెలగబెట్టారని మీడియాతో చెప్పుకోవడానికి మీరు చేసిందల్లా తప్పుడు పనులు, మీ భజన పరులకు పదవుల పందేరం, ప్రశ్నించే వారిని బయటకు తోసేయ్యడం అంతే కదా? దొంగలు పడ్డ ఆరునెలలకు కుక్కలు మొరుగాయి అన్నట్టుగా మీపై ఆరోపణలు వచ్చిన 12 రోజులకు మీడియా ముందుకు వచ్చారు మేము సచ్ఛీలురం అంటూ నేను మీగురించి తక్కువే చెప్పాను ఇంకా చాలా ఉంది చెప్పాల్సినది త్వరలోనే మరికొన్ని నిజాలు సాక్ష్యాలతో మీడియా ముందుకు వస్తాను, మీరు గాని మీ అసోసియేషన్‌లో సభ్యులు గాని నిజంగా ఏ తప్పు చేయకపోతే నాతో బహిరంగ చర్చకు రాగలరా అందుకు నేను సిద్ధం మీరు సిద్ధమా? అని సవాల్ విసిరారు. మలిరెడ్డి ఉపేంద్ర, జనరల్ శక్రటరీ, తూర్పుగోదావరి జిల్లా బాస్కెట్ బాల్ అసోసి యేషన్, రి నెం 1299/1994, 9298107919.

పల్లె పండుగ వారోత్సవాలకు సర్వం సిద్ధం

- నేడు రాజానగరం మండలంలో ప్రారంభం

విశాలాంధ్ర-సీతానగరం/రాజానగరం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించ నున్న పల్లె పండుగ వారోత్సవాలకు సర్వం సిద్ధమయ్యాయని ఎమ్మెల్యే బత్తుల బలరామ కృష్ణ అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఒక ప్రకటనలో ఆదివారం మాట్లాడుతూ ఈ నెల 14 నుండి 21 వరకు నియోజకవర్గ వ్యాప్తంగా పంచాయితీలలో పల్లె పండుగ వారోత్సవాలు ఘనంగా చేపట్టేందుకు శ్రీకారం చుట్టమన్నారు. రాజానగరం నియోజకవర్గంలో ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, టీడీపీ ఇన్‌ఛార్జ్ బొడ్డు వెంకటరమణ చౌదరి ఆధ్వర్యంలో 73 పంచాయితీలలో గల 84 గ్రామాల్లో కనీవిని ఎరుగని విధంగా పలు అభివృద్ధి కార్యక్రమాలకు వేదికగా పల్లె పండుగ జరగనున్నట్లు చెప్పారు. గ్రామపంచాయతీలు అభివృద్ధి ధ్యేయంగా పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేపడతామన్నారు. రాజానగరం మండలంలో సీతారాం పురం గ్రామ పంచాయతీలో సోమవారం ఉదయం ప్రారంభం కానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల గ్రామ అధికారులు, ఎన్డీయే కూటమి నాయకులు పాల్గొనున్నారు.

రవళి స్పిన్నర్స్‌లో విజయదశమి వేడుకలు

దేశ, విదేశాల్లోని తెలుగు ప్రజలకు శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్

విశాలాంధ్ర-పెరవలి: పెరవలి మండలం ఖండవల్లిలోని రవళి స్పిన్నర్స్ ప్రాంగణంలో విజయదశమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. రవళి స్పిన్నర్స్, ఇండియన్ హెయిర్ ఇండస్ట్రీస్ అధినేత శాసనమండలి సభ్యులు వంక రవీంద్రనాథ్ తన కుటుంబ సభ్యులతో కలిసి కార్మికులు సిబ్బంది ఏర్పాటుచేసిన విజయదశమి పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రవీంద్రనాథ్ మాట్లాడుతూ ప్రజలంతా సుఖ శాంతులతో వర్ధిల్లేలా చూడాలని ఆ కనకదుర్గమ్మ తల్లిని వేడుకుంటున్నానన్నారు. చెడు పై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా నిర్వహించుకునే దసరా పండుగ మన జీవితాల్లో కొత్త వెలుగు నింపాలని ఆకాంక్షిస్తున్నాను. దుష్ట సంహారం తర్వాత శాంతి, సౌభ్రాతృత్వంతో అందరూ కలిసిమెలిసి జీవించాలన్నదే దసరా పండుగ సందేశం అన్నారు. ఇదే స్ఫూర్తితో శాంతియుత, అభివృద్ధికారక సమాజానికి కృషి చేద్దామన్నారు. శక్తి ఆరాధనకు ప్రాధాన్యతనిచ్చే ఈ పండుగ దినాల్లో అమ్మవారి దివ్యమంగళ రూపాన్ని తొమ్మిది అవతారాల్లో దర్శించుకున్నాం.అందరికి మనస్ఫూర్తిగా దసరా శుభాకాంక్షలు తెలుపుతున్నానన్నారు. రాష్ట్ర ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని, ప్రకృతి వైపరీత్యాలను సమర్థవంతంగా ఇదుర్కొనే శక్తి కనక దుర్గా దేవి ప్రజలకు అందజేయాలని ఆయనఅన్నారు. పరిశ్రమలలో ఈ మధ్య రాష్ట్రంలో ప్రమాదాలు జరుగుతున్నాయని, కార్మికులు కూడా శ్రద్ధగా యంత్రాల పనితీరు చూసుకోవాలని తెలిపారు. నిత్యావసర వస్తువులు ప్రజలకు అందుబాటులోకి రావాలని, రైతులకు మేలు జరిగేలా విజయదశమి కొనసాగాలని రవీంద్ర నాథ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రవళి స్పిన్నర్స్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ వంక రాజకుమారి, రవళి స్పిన్నర్స్ డైరెక్టర్ రవళి, సీఈఓ వికాస్ , మానవ వనరుల అధికారి వీరస్వామి, సాంకేతిక అభివృద్ధి అధికారి రాజశేఖర్ బిర్వాజ్, కార్మికులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

తాటిపాకలో సినీనటి డింపుల్ హాయతి సందడి

కెవిఆర్ మాల్ ప్రారంభించిన నటి డింపుల్

విశాలాంధ్ర - రాజోలు : మండలంలోని తాటిపాకలో నూతనంగా ఏర్పాటు చేసిన కాంచీపురం వారి కెవిఆర్ మాల్‌ను సినీనటి డింపుల్ హాయతీ ఆది వారం జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. షోరూమ్‌ను తాటిపాక ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు అడబాల దొరబాబు, క్యాష్ కౌంటర్‌ను కంచర్ల బాబి, మొదటి అంతస్తును లెక్కింశెట్టి రత్నబాబు, శారీస్ సెక్షన్‌ను చిక్కం శ్రీనివాస రావు ప్రారంభించారు. ఈసందర్భంగా డింపుల్ హాయతీ మాట్లాడుతూ సృజనాత్మక, నాణ్యత, నైపుణ్యంతో కూడిన వస్త్రాలను కెవిఆర్ మాల్ కోనసీమ ప్రాంతంలో తాటిపాకలో ప్రారంభించడం ఇక్కడి ప్రాంత ప్రజల అదృష్టం అని అన్నారు. సామాన్య ప్రజలకు సహితం అందుబాటులో ఉండేలా ధరలను నిర్ణయించారని ఆమె అన్నారు. ఆంధ్రప్రాంతం అంటే ఎంతో ఇష్ట మని ఇక్కడి ప్రజలు తనపై ఎంతగానో ప్రేమాభిమానాలు చూపి స్తారన్నారు. ఈసందర్భంగా ఆమె స్టేజ్ పై డాన్స్ వేసి అభిమానులను అలరించారు. ఈకార్యక్రమంలో కెవిఆర్ మాల్ వ్యవస్థాపకులు కె సుబ్బరాజు, కె సురేష్, రాజోలు ఎంపీపీ కేతా శ్రీనివాస్, లెక్కింశెట్టి బాబులు, లెక్కింశెట్టి నానాజీ తదితరులు పాల్గొన్నారు.

బకాయిలు చెల్లించాలి

విశాలాంధ్ర-దేవరపల్లి: 2014-19 కాలంలోని ఎన్టీఆర్ లబ్ధిదారులు అందరికీ బకాయిలు చెల్లించాలని చనిపోయిన లబ్దదారులుంటే వారి వారసులకు బకాయిలు ఇవ్వాలని సీపీఎం శాఖా మహాసభ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది ఆదివారం స్థానిక కె రత్నాజీ నివాసంలో సిపిఎం 14వ శాఖ మహాసభ జరిగింది మహాసభ ప్రారంభాన్ని సూచికగా దేవరపల్లి సెంటర్లోని సీపీఎం జెండాను ఆవిష్కరించారు. అనంతరం జరిగిన శాఖా మహాసభకు సీనియర్ పార్టీ సభ్యులు మడిల్లి రామారావు అధ్యక్షత వహించారు మహాసభకు ముఖ్యఅతిథిగా పాల్గొన్న సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎం సుందర్ బాబు మాట్లాడుతూ దేవరపల్లి మండలంలో ఎన్టీఆర్ గృహ లబ్ధిదారులు 700 మంది పైగా ఉన్నారని తెలిపారు గత వైసిపి ప్రభుత్వం ఎటువంటి బకా యిలు ఇవ్వలేదని ఫలితంగా లబ్ధిదారులు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొన్నారని ఆవేదన వ్యక్తం చేశారు మృతి చెందిన లబ్ధిదారుల స్థానంలో వారి వారసులకు బకాయిలు ఇవ్వాలని కోరారు రాష్ట్ర ప్రభుత్వం జమిలి ఎన్నికలకు వ్యతిరేకంగా అసెంబ్లీ తీర్మానాన్ని చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సభ్యులు ఏకగ్రీవంగా ఎస్ భగత్ ని నూతన కార్యదర్శిగా ఎన్నుకున్నారు సహాయ కార్యదర్శిగా కే రత్నాజీ ఎన్నికయ్యారు ఈ మహాసభలో ఉండవెల్లి కృష్ణారావు పిన్నమనేని సత్యనారాయణ అయినపర్తి శ్రీనివాసరావు చాపల నీలం పాల్గొన్నారు.

అమ్మవారికి పూర్ణాహుతి

విశాలాంధ్ర - గండేపల్లి : దేవి నవరాత్రుల్లో 9 రోజులు దుర్గమ్మ అమ్మవారికి చేసిన పూజలు, హోమాలు, జపాలు పుణ్య ఫలం ప్రజలం దరికీ దక్కాలని పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహించినట్లు దువ్వూరి శేషగిరి శాస్త్రి సిద్ధాంతి అన్నారు. గండేపల్లి మహర్షి జ్యోతిషాలయం ఆధ్వర్యంలో శరన్నవరాత్రి వేడుకలు నిర్వహించి దుర్గమ్మ తల్లి అమ్మవారికి 9 రోజులు పూజలు నిర్వహించారు. దశమి తాత్కాల ఏకాదశిని మహాపూర్ణాహుతి కార్యక్రమాన్ని జరిపారు. ఈ సంధర్భంగా శేషగిరి శాస్త్రి మాట్లాడుతూ ప్రజలందరూ ఆరోగ్యంగా సుభిక్షంగా ఉండాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టడం జరిగిందని వారు అన్నారు. తదుపరి అనంతరం పూర్ణాహుతిలో పాల్గొన్న వారికి అన్న ప్రసాద వితరణ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

భారీ అన్న సమారాధన

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి మండలం మల్లేపల్లి జాతీయ రహదారి హైవే బ్రిడ్జి ప్రక్కన ఇనకోటి వెంకటేశ్వరరావు స్థలంలో నూతనంగా నిర్మించిన శ్రీశ్రీశ్రీ విజయ కనకదుర్గ అమ్మవారి ఆలయం వద్ద విజయదశమి సందర్భంగా భారీ అన్న సమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, కాకినాడ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు జ్యోతుల నవీన్, మాజీ ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు హాజరయ్యారు. వీరికి గ్రామ పురోహితులు చింతా అరుణ్ కుమార్ శర్మ ప్రత్యేక పూజలు జరిపించారు. ఈ కార్యక్రమంలో కోర్పు లచ్చయ్య దొర, మండల పార్టీ అధ్యక్షులు పోతుల మోహన్‌రావు, మారిశెట్టి భద్రం, గ్రామ ఉపసర్పంచ్ దొమ్మా శ్రీను, అడబాల భాస్కరరావు, దుర్గమ్మ ఆలయ కమిటీ సభ్యులు అధిక సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

విజయ దుర్గ అమ్మవారి ఆలయంలో బోనాలు

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ఓమ్మంగి శ్రీ విజయ దుర్గ అమ్మవారి ఆలయ వద్ద విజయదశమిని పురస్కరించుకుని గ్రామంలోని అమ్మవారికి విశేషమైన పూజ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం బోనాల ఉత్సాహం ఘనంగా నిర్వహించారు. మహిళలు బోనాలు ఎత్తుకొని గ్రామం చుట్టూ మేళతాళాలతో ఊరేగి అమ్మవారికి బోనాలు సమర్పించుకున్నారు. అనంతరం విజయ దుర్గ అమ్మవారి ఆలయ నిర్వాహకులు రామిశెట్టి రమేష్ ఆధ్వర్యంలో భారీ స్థాయిలో అన్న అన్నసంతర్పణ కూడా నిర్వహించారు.

ఘనంగా అన్న సమారాధన

విశాలాంధ్ర - సామర్లకోట : సామర్లకోట మండలం పెద్దబ్రహ్మదేవం గ్రామంలో శ్రీ శారదా రామకృష్ణ సేవాసమితి ఆధ్వర్యంలో 65వ శరన్న వరాత్రి ఉత్సవములు పూర్ణాహుతి అన్నసమారాధనతో ఘనంగా ముగిసాయి. ఉదయం ఏకవార రుద్రాభిషేకం, అష్టోత్తర శతనామావళి, నీరాజనం మంత్రపుష్పంతో కార్యక్రమాలు అత్యంత భక్తి శ్రద్ధలతో జరిగాయి. అనంతరం నిర్వహించిన అన్నసమారాధనలో భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సమితి గౌరవ అధ్యక్షులు వింజమూరి సుబ్రహ్మణ్య శర్మ, అధ్యక్షుడు తోటకూర గంగాధర్, కార్యదర్శి వింజమూరి విశ్వనాథ్, సభ్యులు నువ్వుల వెంకటరాజు, ఆచంట సత్యనారాయణ, టివివి సత్యనారాయణ, నువ్వుల బాబ్జీ, సూర్య చంద్ర రావు, కమ్మిల వెంకటేశ్వరావు, టి నరసింహారావు, ఎస్ బాపనయ్య, తాడాల దొరబాబు, తదితర సమితి సభ్యులు వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.